భీమవరం **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 31.0
కనిష్ఠం : 17.0

నేటి నుంచి టెట్



జిల్లాలో 8 సెంటర్లలో పరీక్ష

అభ్యర్థులు 12,985 మంది

భీమవరం రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) బుధవారం నుంచి మొదలుకానున్నాయి. జిల్లాలో ఎనిమిది పరీక్షా కేంద్రాల్లో కంప్యూటర్ బేసెడ్ టెస్ట్ మోడ్‌లో నిర్వహించనున్నారు. ఉదయం 9.30 గంటలకు ఒక విడత , మధ్యాహ్నం 2.30 గంటలకు మరో విడతగా నిర్వహిస్తారు. పరీక్ష సమయానికి గంటన్నర ముందుగానే హాల్‌లోకి అభ్యర్థులను అనుమతిస్తారు. హాల్ టిక్కెట్ వెరిఫికేషన్ కోసం పరీక్ష రాసే అభ్యర్థి ఫొటో గుర్తింపు కార్డును తెచ్చుకోవాలి. పరీక్షకు సంబంధించిన సలహాలు, ఫిర్యాదులు కోసం డీఈవో కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. భీమవరంలో విష్ణు మహిళా ఇంజనీరింగ్ కళాశాల, డీఎన్నార్ ఇంజనీరింగ్, విట్ కళాశాల, దంతులూరి నారాయణరాజు (డీఎన్నార్ డిగ్రీ కళాశాల), ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలల్లో పరీక్షలు నిర్వహిస్తారు. నరసాపురంలో స్వర్ణాంధ్ర, తాడేపల్లిగూడెంలో వాసవీ, శశి ఇంజనీరింగ్ కళాశాలల్లో పరీక్షలు నిర్వహించనున్నారు.

స్మార్ట్ కార్డులకు గడువు పెంపు

భీమవరం టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం కొత్తగా స్మార్ట్ కార్డు పేరుతో అందించే రైస్‌కార్డు తీసుకునేందుకు గడువును ఈనెల 15వ తేదీ వరకు పెంచారు. జిల్లాలో రైస్ కార్డులు దాదాపు 5 లక్షల 57 వేల వరకు ఉండగా వాటిలో 5 లక్షల 51 వేల 332 కార్డులకు లబ్ధిదారుల వివరాలతో స్మార్ట్ కార్డులను తయారు చేసి అందించారు. గత ఆగస్టు 25 నుంచి కార్డుల పంపిణీ ప్రారంభించింది. మొదట్లో గ్రామ సచివాలయ ఉద్యోగులతో పంపిణీ చేశారు. తరువాత రేషన్ డీలర్లకు అప్పగించారు. ఇప్పటివరకు 5 లక్షల 23 వేల 404 కార్డులను అందించారు. ఇంకా 27 వేల 928 కార్డులు అందించాల్సి ఉంది. ప్రసుత్తం ఈ కార్డులను డీలర్స్ దగ్గర నుంచి తహసీల్దార్ కార్యాలయాలకు అప్పగించారు. కార్డుదారులు పాత రేషన్ కార్డు కానీ, కార్డు నంబరు గానీ తీసుకువెళ్తే వారికి స్మార్ట్ రైస్ కార్డు అందిస్తారు.

రేపు పెంటపాడు ఎంపీపీ ఎన్నిక

భీమవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): : పెంటపాడు మండల పరిషత్ అధ్యక్ష ఎన్నిక గురువారం నిర్వహించనున్నారు. ఎంపీపీ హైమావతిపై అవిశ్వాసం నెగ్గడంతో పదవి ఖాళీ అయ్యింది. నూతన ఎంపీపీ ఎన్నిక కోసం అధికారులు ఎన్నికల సంఘానికి ప్రతిపాదించారు. దీనిపై ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. గురువారం ఎన్నిక నిర్వహించేలా ఆదేశాలు జారీచేసింది. ఆ దిశగా అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. కూటమి తరఫున జనసేన అభ్యర్థిగా కట్టుబోయిన వెంకటలక్ష్మిని ప్రతిపాదించనున్నారు. ఎన్నిక లాంఛనప్రాయం కానుంది. అవిశ్వాసం రోజునే నాటి ఎంపీపీ హైమావతి, ఆమె అనుచరులైన మరో ముగ్గురు సభ్యులు ఎన్నికకు దూరంగా ఉన్నారు. ఈసారి కూడా ఆ నలుగురు ఎన్నికకు దూరంగా ఉండే అవకాశం ఉంది. తెలుగుదేశం, జనసేన తరఫున 14 మంది సభ్యులున్నారు. వెంకటలక్ష్మిని వీరంతా ఏకగ్రీవంగా ఎన్నుకునేలా కసరత్తు పూర్తయింది. ఎన్నిక రోజే ఎంపీపీ ప్రమాణ స్వీకార ప్రక్రియను పూర్తి చేయనున్నారు.

పాలకొల్లు రైల్వే గేటు మూసివేత

పాలకొల్లు అర్బన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భీమవరం రోడ్డులో ఉన్న రైల్వే గేటును మంగళవారం ఉదయం నుంచి మూసివేశారు. ట్రాక్ మరమ్మతుపనులు చేపట్టినట్టు డీఆర్‌సీసీ సభ్యుడు జక్కంపూడి కుమార్ తెలిపారు.ఈనెల 14 వతేదీ వరకూ పనులు జరుగుతాయని 14వ తేదీ రాత్రి 7 గంటల నుంచి గేటు ఓపెన్ చేస్తారని కుమార్ తెలిపారు. గేటు మూసివేయడంతో బస్సులు, ఆటోలు, బైక్‌లపై ప్రయాణించేవారు పూలపల్లి బైపాస్ రోడ్డు మీదుగా వెళ్లవలసి వస్తోంది.

గర్భం దాల్చిన టెన్త్ విద్యార్థిని

జీలుగుమిల్లి/బుట్టాయగూడెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జీలుగుమిల్లి మండలంలోని ఓ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో టెన్త్ విద్యార్థిని గర్భం దాల్చింది. విషయం మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాఠశాల సిబ్బందికి అనుమానం రావడంతో బాలికకు వైద్య పరీక్షలు చేయించారు. బాలిక గర్భం దాల్చినట్టు వైద్యులు నిర్ధారించారు. బుట్టాయగూడెం మండలానికి చెందిన ఈ బాలికకు వైద్య పరీక్షలు నిర్వహించి పది రోజులైందని, సంబంధిత అధికారులు గోప్యంగా ఉంచినట్టు తెలిసింది. విషయం తెలిసిన వెంటనే డిప్యూటీ డీఎంహెచ్‌వో జె.సురేష్‌కుమార్ విచారణ జరిపారు. బాలిక ఐసీడీఎస్, వైద్యాధికారుల పర్యవేక్షణలో ఉంది.

కొనుగోళ్లు స్పీడ్



మండలం	లక్ష్యం	కొనుగోలు
	(మెట్రిక్ టన్నుల్లో)	
ఆకివీడు	9417	1,910
భీమవరం	12,069	5,577
గణపవరం	27,132	18,779
కాళ్ల	8,607	2,864
పాలకోడేరు	26,131	13,788
ఉండి	25,382	10,691
వీరవాసరం	24,906	10,533
ఆచంట	23,968	5,961
మొగల్తూరు	1,446	520
నరసాపురం	15,419	2,484
పాలకొల్లు	22,487	7,327
పెనుగొండ	28,204	10,712
పెనుమంట్ర	28,989	12,759
పోడూరు	28,931	8,544
యలమంచిలి	13,341	947
అత్తిలి	33,455	14,449
పెంటపాడు	51,322	41,865
తాడేపల్లిగూడెం	59,855	45,846
ఇరగవరం	32,195	15,967
తణుకు	26,744	20,327



సర్వర్ సమస్యతో సిద్ధాపురంలో ఆర్‌ఎస్‌కె వద్ద నిలిచిపోయిన ధాన్యం వాహనాలు

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం

లక్ష్యం 5 లక్షల టన్నులు..2.5 లక్షలు సేకరణ

ప్రథమస్థానంలో పెంటపాడు మండలం

తాడేపల్లిగూడెం రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్ల వేగం పుంజుకున్నాయి. ఇప్పటికే జిల్లాల్లో 80 శాతానికి పైగా వరికోతలు పూర్తయ్యాయి. తణుకు, తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాల్లో అత్యధికంగా కొనుగోళ్ల పూర్తికాగా మిగిలిన ప్రాంతాల్లో వేగవంతం చేసేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. ఇప్పటికే జిల్లాలో 5 లక్షల మెట్రిక్ టన్నులకు 2.5 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించారు. మిగిలినది సేకరించేందుకు సమా యత్తం కావాలని ఆదేశించారు. తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజన్ లోని పెంటపాడు మండలం జిల్లాలోనే అత్యధికంగా 82 శాతం ధాన్యం కొనుగోళ్ల పూర్తికాగా రెండో స్థానంలో తాడేపల్లిగూడెం మండలం 77 శాతం, తణుకు మండలంలో 76 శాతం కొనుగోళ్ల పూర్తి చేశారు. జిల్లాలో అత్యల్పంగా ఆకివీడు మండలంలో 20 శాతం మాత్రమే పూర్తయింది. నరసాపురం రెవెన్యూ డివిజన్‌లో అత్యల్పంగా 30 శాతం సేకరించగా, భీమవరం డివిజన్‌లలో 50 శాతం దాటలేదు. ఆయా మండలాల్లో 50 శాతం పైగా వరి కోతలు పూర్తి కావస్తున్నాయి. ధాన్యం విక్రయించిన రైతులకు గంటల్లోనే సొమ్ములు జమ చేస్తూ ప్రభుత్వం రికార్డు సృష్టించింది. దీన్నిపై అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలో బ్యాంకు ఖాతాలకు ఆధార్ లింక్ అవని 154 మంది రైతులకు సొమ్ములు జమ కాలేదు. వారి బ్యాంకు ఖాతాలు పునరుద్ధరించుకోవాలని ఇప్పటికే జిల్లా అధికారులు సూచనలు చేశారు.

సర్వర్ సమస్యతో రైతుల అగచాట్లు

ఆకివీడురూరల్ డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సర్వర్ల సమస్యతో ఆర్‌ఎస్‌కేల వద్ద పడిగాపులు కాస్తున్నారు. సోమవారం నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద సర్వర్లు పనిచెయ్యకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్ర 5 గంటల వరకు సర్వర్లు మొరాయిం చడంతో రైతులు నిరాశ చెందారు. సార్వా మాసూళ్ల ముమ్మరంగా జరుగుతున్న తరుణంలో సర్వర్ సమస్య రైతులను ఇక్కట్లు పాలు చేస్తున్నది. ఆకుమడులకు సంసిద్ధం చెయ్యాల్సి ఉండటం, పొలాల్లోని గడ్డి గట్టుపైకి చేరవేసే పనుల్లో తలమునకలైన రైతులకు సర్వర్ సమస్య మనోవేదనకు గురిచేస్తున్నది. ఆకివీడు మండలంలో 9,400 మెట్రిక్ టన్నులు ధాన్యం లక్ష్యం కాగా 1910 మెట్రిక్ టన్నులు మిల్లులకు చేరగా 8,300 టన్నులు చేరాల్సి ఉంది.

ధాన్యంతో ఆర్‌ఎస్‌కె వద్ద ఉదయం నుంచి పడిగాపులు కాస్తున్నాం. మిగిలిన పనులన్నీ పక్కనపెట్టి కాపలా కాస్తున్నామని సిద్ధాపురానికి చెందిన రైతు కర్రా అగస్టీన్ వాపోయాడు. సర్వర్ సమస్య గురుంచి జేసీకి ఫిర్యాదు చేసినట్టు రైతు నున్న గణపతి తెలిపాడు.

సమస్యల పరిష్కారానికి క్విక్ రెస్పాన్స్ టీమ్‌లు : జేసీ

భీమవరం రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు వేగవంతంగా జరుగుతుందని, ఇప్పటివరకు 2.50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 37 వేల మంది రైతుల నుంచి కొనుగోలు చేసినట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. 90 వేల సంచులను రైతుసేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామన్నారు. మండల స్థాయిలో తహసీల్దార్, మండల వ్యవసాయాధికారి, టెక్నికల్ అసిస్టెంట్‌లతో ఒక క్విక్ రెస్పాన్స్ టీమ్ ఏర్పాటు చేశాం. రైస్ మిల్లుల వద్ద రైతులు ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకునేందుకు చర్యలు తీసుకున్నాం. సిబ్బంది స్పందించకుంటే క్విక్ రెస్పాన్స్ టీమ్‌ను గాని, కంట్రోల్ రూం 81216 76653 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. 40 కేజీల 600 గ్రాములు మాత్రమే తూకం పట్టాలని, తేమ శాతం సాకుగా చూపి 41 కేజీలు లేదా 42 కేజీలు పట్టేవారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రబీకు అవసరమైన యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని జేసీతెలిపారు. డిసెంబర్ మాసానికి 3,800 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ప్రస్తుతం జిల్లాలో 8,900 టన్నులు సొసైటీలు, ఆర్‌ఎస్‌కే, లైసెన్స్ డీలర్ల వద్ద అందుబాటులో ఉందన్నారు. దళారులు రైతులను ఇబ్బందిపెడితే వ్యవసాయశాఖ అధికారిని సంప్రదించాలన్నారు. జిల్లాస్థాయిలో 83310 56742 నంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయాలన్నారు.

కమిషనర్ బదిలీపై సస్పెన్స్



కొద్ది రోజులుగా కూటమి ప్రయత్నాలు

తాజాగా వైసీపీ కౌన్సిలర్ల తీర్మానం

పట్టణంలో ఆసక్తికర చర్చ

నరసాపురం, డిసెంబరు 9 (ఆంధ్ర జ్యోతి): కొద్ది రోజులుగా నరసాపురం మునిసిపల్ కమిషనర్‌ను బదిలీ చేసేం దుకు కూటమి నేతలు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయన పనితీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తడంతో సాగనంపేం దుకు అన్ని ప్రయత్నాలు చేశారు. సరిహద్దునున్న జిల్లాలో పనిచేస్తున్న ఓ కమిషనర్‌ను తెచ్చుకునేందుకు సిఫార్స్ కూడా చేశారు. అయితే సాంకేతిక కారణాలతో ఇది పెండింగ్ పడింది. ఈ నేపథ్యంలో మునిసిపాల్టీలో కొత్త పరిణామాలు చోటు చేసుకున్నాయి. కమిషనర్ అంజయ్య తీరుపై వైసీపీ కౌన్సిలర్లు ముప్పేట దాడికి దిగారు. ఈ కమిషనర్ మాకొద్దంటూ 12 మంది కౌన్సిలర్లు తీర్మానం చేశారు. తాజాగా జేసీకి కూడా విన్నవించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇక్కడ పనిచేస్తున్న కమిషనర్ వెంకటేశ్వరావు ఒంగోలు కార్పోరేషన్‌కు బదిలీ అయ్యారు. దీంతో ఖాళీగా ఉన్న ఈ స్థానంలో అంజయ్యను తీసుకొచ్చారు. 18 నెలల అంజయ్య హయాంలో అభివృద్ధి కన్నా అవినీతే ఎక్కువ అన్న ఆరోపణలు పురపాలకంలో వ్యక్తమయ్యాయి. ప్రతి కౌన్సిల్ సమావేశంలో స్వపక్ష, విపక్ష సభ్యులు ఆయన తీరుపై గళం ఎత్తారు. కూటమి నాయకులు కూడా పలుమార్లు విప్ నాయకర్‌కు కమిషనర్‌ను మార్చాలన్న అభిప్రాయాన్ని వ్యక్తపర్చారు. నరసాపురం వచ్చేందుకు ఎవరూ ఆసక్తి చూపించక పోవడంతో ఇది పెండింగ్ పడుతూ వచ్చింది. ప్రధానంగా పురపాలకంలో డంపింగ్ యార్డు పెద్ద సమస్యగా మారింది. ఇక్కడికి వస్తే తలనొప్పిగా మారుతుందన్న భావన చాలా మందిలో నెలకొంది. ఈ నేపథ్యంలో సరిహద్దు జిల్లాలో పనిచేస్తున్న ఓ కమిషనర్ ఇక్కడికి వచ్చేందుకు ఆసక్తి చూపించడంతో రెండు నెలల ముందు ఆయనకు సిఫార్స్ లేఖ కూడా ఇచ్చారు. ఆయనకు ఇంత వరకు పోస్టింగ్ పడలేదు.ఇదే సమయంలో వైసీపీ కౌన్సిలర్లు అయన్ను మార్చేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ప్రభుత్వం అంజయ్యను బదిలీ చేస్తే ఆ క్రెడిట్ వైసీపీ కౌన్సిలర్లకు వెళ్లతుందన్న భావన కూటమి నేతల్లో వ్యక్తమవుతోంది. పుష్కరాలు, కంపోస్టుయార్డు సమస్య జఠిలం కావడంతో సమర్థవంతమైన

- మిగతా 8లో



కమిషనర్ అంజయ్యపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విప్ నాయకర్

మీ వల్ల మాకు చెడ్డపేరు.. సెలవుపై వెళ్లిపోండి ..

కమిషనర్‌పై ఎమ్మెల్యే నాయకర్ ఫైర్

మునిసిపల్ కమిషనర్ అంజయ్య తీరుపై విప్ నాయకర్ మండిపడ్డారు. పట్టణంలో డపింగ్‌యార్డు సమస్య తలెత్తడానికి మీ పనితీరే కారణమంటూ ఫైర్ అయ్యారు. మీ వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోంది.. సెలవుపై వెళ్లిపోండి అంటూ ఆగ్రహించారు. సరైన నిర్ణయం తీసుకోకపోవడం వల్ల ఈరోజు ఎక్కడ చూసినా చెత్త పేరుకుపోయింది.దీన్ని యుద్ధ ప్రాతిపాదికన క్లీన్ చేయాలని.. అవసరమైతే లారీలు ఏర్పాటు చేసి గుంటూరు జిందాల్ పవర్‌ప్లాంట్‌కు తరలించాలని ఆదేశించారు.మంగళ వారం సాయంత్రం పట్టణంలో ఆర్డీవో దాసిరాజుతో కలిసి

- మిగతా 8లో



ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ పుట్టిన రోజు వేడుకలు ఆయన అభిమానులు, పార్టీ కార్యకర్తలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కార్యాలయంలో వడలికి చెందిన పలువురు నాయకులు 60 కేజీల కేక్‌ను పితానితో కట్ చేయించారు.

ఫిట్‌నెస్ భారం

- రవాణా శాఖ నుంచి తప్పించిన కేంద్రం
- ఏటీఎస్ కేంద్రాల్లో ఇక తనిఖీలు
- జిల్లాలో అందుబాటులో లేని కేంద్రం
- ఇతర జిల్లాలకు వెళ్లాల్సిందే
- మరోవైపు చార్జీలు పెంపు
- ఉక్కిరిబిక్కిరి అవుతున్న రవాణా రంగం

జిల్లా రవాణా రంగంపై ఫిట్‌నెస్ భారం పడుతోంది. ఇప్పటిదాకా రవాణా శాఖ అధికారులు తమ పరిధిలోని వాహనాలను తనిఖీ చేసి ఫిట్‌నెస్ (ఎఫ్‌సీ) ధ్రువీకరించేవారు. కేంద్ర ప్రభుత్వం ఏటీఎస్ కేంద్రాల ద్వారా ఫిట్‌నెస్ తనిఖీలు చేసి ధ్రువీకరణ పత్రాలు ఇచ్చే బాధ్యతను ఏజన్సీలకు అప్పగించింది. దేశవ్యాప్తంగా ఇదే విధానాన్ని అమలు చేస్తోంది. అయితే ఒక్కో రాష్ట్రంలో ఒక్కో తరహాలో ఏటీసీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఏటీఎస్ కేంద్రాలు లేకపోవడంతో ఇకపై పొరుగు జిల్లాకు వెళ్లాల్సి ఉంటుంది. విజయవాడ, రాజమండ్రి, అమలాపురంలో ఏటీఎస్ కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. జిల్లాలో పాలకోడేరు మండలం కోరుకొల్లులో ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేశారు. అక్కడ స్థలం అనుకూలంగా లేదంటూ విరమించుకున్నారు. జిల్లాలో ఇంకెక్కడా ప్రతిపాదనలు లేవు. పైగా చార్జీల భారం తట్టుకోలేకపోతున్నామని వాహనదారులు వాపోతున్నారు.

భీమవరం/తణుకు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్రం ఏటీఎస్ కేంద్రాల ద్వారానే ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌లు జారీచేయాలంటూ స్పష్టం చేసింది. రవాణా శాఖ అధికారులకు ఇకపై ఎటువంటి ప్రమేయం లేదు. కొన్ని రాష్ట్రాల్లో రవాణాశాఖ అధికారుల అనుమతితోనే ఏటీఎస్ కేంద్రాల్లో తనిఖీలు చేస్తున్నారు. ఏటీఎస్ కేంద్రాలకు బండి నంబర్ ఉంటే సరిపోతుంది. రవాణా శాఖ అధికారులు అలా కాదు. సదరు నంబర్ అదే వాహనానిది అవునో కాదో కూడా నిర్ధారించుకుంటారు. ఆ తర్వాత ఫిట్‌నెస్ తనిఖీలు చేస్తారు. ప్రస్తుతం ఇతర జిల్లాల్లో ఉన్న ఏటీసీ కేంద్రాల్లో కేవలం బండి నంబర్ ఆధారంగానే ఫిట్‌నెస్‌లు ధృవీకరిస్తున్నారు. దీనివల్ల ఎవరైనా తప్పుడు ధృవీకరణలు తీసుకునే అవకాశం ఉంటుందని రవాణా శాఖ అధికారులు అనుమానిస్తున్నారు. ఇక తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వమే ఏటీఎస్ కేంద్రాలను నిర్వహించనున్నట్టు నిర్ణయం తీసుకుంది. అంటే రవాణా శాఖ ఆధ్వర్యంలోనే కేంద్రాలు నిర్వహిస్తారు. మిషనరీ ద్వారా తనిఖీలు జరిగిపోతాయి. అయితే అక్కడ ప్రభుత్వం రవాణా శాఖకే సదరు బాధ్యతలు అప్పగించింది. ఇక్కడ మాత్రం కాంట్రాక్ట్ ఏజన్సీలకు బాధ్యతలు అప్పగించారు. అయినా సరే జిల్లాలో ఏటీఎస్ కేంద్రం అందుబాటులోకి రాలేదు. అదే ఇప్పుడు రవాణా రంగానికి పెద్ద భారంగా మారుతోంది. ఇతర జిల్లాలకు వెళ్లాలంటే 50 నుంచి 100 కిలో మీటర్లు ప్రయాణం చేయాలి. అదే రోజు అక్కడ తనిఖీలు నిర్వహించకపోతే మరుసటి రోజు వరకు వేచి ఉండాలి. ఇది అదనపు భారంగా రవాణా యాజమానులు భావిస్తున్నారు.

జిల్లాలో రవాణా రంగం కీలకం

జిల్లాలో రవాణా రంగానికి ఒక ప్రత్యేకత ఉంది. ఆక్వా ఎగుమతులు అధికంగా ఉంటాయి. మైనింగ్ రవాణా వాహనాలు ఎక్కువగానే ఉన్నాయి. ఆటో రవాణా రంగంపైనా వేలాది మంది జీవనం సాగిస్తున్నారు. మొత్తంపైన అన్ని రకాల వాహనాలు జిల్లాలో 40వేల వరకు ఉన్నాయి. ప్రతిఏటా ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌లు పొందాలి. దానికోసం ఇతర జిల్లాలకు వెళ్లాల్సి ఉంటుంది. ఏటీఎస్ కేంద్రాల్లో జారీ అయినా సర్టిఫికెట్‌లపై రవాణా శాఖ అధికారులు అభ్యంతరాలు తెలుపుతున్న సందర్భాలుంటున్నాయి. ఇతర జిల్లాలో దాదాపు 60వేల వరకు ఇటువంటి అభ్యంతరాలున్నాయంటూ అధికారులు చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వం మాత్రం సక్రమంగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌లు జారీ చేయాలన్న ఉద్దేశంతో ఏటీఎస్ కేంద్రాలను ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. కొన్ని రాష్ట్రాలు రవాణా శాఖ కనుసన్నల్లోనే జరిగేలా చర్యలు తీసుకుంటున్నాయి. రవాణా అధికారులు జోక్యం ఉండేలా ఏర్పాట్లు చేసుకుంటున్నాయి, ఇక్కడ పూర్తిగా ఏజన్సీలకు బాధ్యతలు అప్పగించారు. అయినా సరే జిల్లాలో అందుబాటులో ఉంటే రవాణా యజమానులకు ఎటువంటి ఇబ్బంది ఉండదు. కానీ ఇతర జిల్లాలకు వెళ్లాల్సి రావడంతోనే ఇబ్బందులు పడే అవకాశం ఉందని ఘొల్లు మంటున్నారు.

చార్జీల భారం

ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ల కోసం ఇతర ప్రాంతాలు వెళ్లాల్సి రావడం ఒక ఎత్తయితే ఇటీవల కేంద్రం చార్జీలను పెంచింది. గతంలో ఫిట్‌నెస్ చార్జీలు రూ.900 నుంచి 1400 వరకు మాత్రమే ఉండేవి. ప్రస్తుతం చార్జీలు రూ.2,300 నుంచి 33వేలుకు పెరగడంతో వాహనదారులకు ఆర్థిక భారమైంది.


నరేంద్ర సెంటర్‌లో ధర్నా చేస్తున్న రవాణా రంగ కార్మికులు

రవాణా రంగ సమస్యలు పరిష్కరించాలి

తణుకు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రవాణా రంగంలో వాహనదారులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ముందుకు రైల్వే స్టేషన్ రోడ్డు వద్ద జేఏసీ కార్యాలయం నుంచి పలు యూనియన్‌ల ప్రతినిధులు ర్యాలీగా నరేంద్ర సెంటర్ వరకు విచ్చేశారు. అక్కడ ధర్నా నిర్వహించి సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్, ఎంవిఐ కార్యాలయాలు వద్ద నిరసన తెలిపారు.

చలానా ధరలు తగ్గించాలి


వాహనాల ఫిట్‌నెస్ సమయంలో వెళ్ళినపుడు చెల్లించే చలానా ధరలు తగ్గించాలి. పెంచిన చలానా ధరలు వల్ల ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము. అందువల్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వాహనదారులకు అనుకూల నిర్ణయం తీసుకోవాలి.

- శీలం శ్రీనివాసరావు, జేఏసీ నాయకుడు

రాయితీలు వర్తింపజేయాలి


ప్రభుత్వం సొంత వాహనదారులకు ఇచ్చే రాయితీలు ట్రావెల్స్‌కు వర్తింపజేయాలి. ఎక్కువ మంది సొంతంగా రిజిస్టర్ చేయించి ట్రావెల్స్ నడుపుతున్నారు. నిజాయితీగా ట్రావెల్ బోర్డు పెట్టిన మాకు భారీగా పన్నులు చెల్లిస్తున్నాం. అందువల్ల పన్ను విధానంలో వ్యత్యాసం తగ్గించాలి.

- పేపకాయల సత్యనారాయణ, జేఏసీ నాయకుడు

ఏటీఎస్ విధానం వద్దు


కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఏటీఎస్ విధానాన్ని తక్షణం ఉపసంహరించు కోవాలి. ఈ విధానంతో ఇబ్బందులు ఉన్నాయి. పాత విధానంలోనే ఫిట్‌నెస్ పరీక్షలు రవాణా కార్యాలయ ంలోనే చేయాలి

- రావి కృష్ణారావు, జేఏసీ నాయకుడు

మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో నాగబాబుకు పతకాలు



భీమవరం టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి):హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ స్టేడియంలో ఈ నెల 7న జరిగిన 7వ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఓపెన్ మీట్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో మలేరియా విభాగంలో జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారిగా పనిచేస్తున్న యాతం నాగబాబు పలు పతకాలను సాధించారు. 22 రాష్ట్రాల నుంచి 1254 మంది అథ్లెట్లు పాల్గొన్నారు. ఈ పోటీల్లో నాగబాబు 1500 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానం దక్కించుకుని రజిత పతకం అందుకున్నారు. 800 మీటర్లు పరుగులో తృతీయ స్థానం దక్కించుకుని కాంస్య పతకం, 400 మీటర్లు పరుగులో తృతీయ స్థానంతో కాంస్య పతకం దక్కించుకున్నారు. 2013 నుండి ఇప్పటి వరకు జరిగిన వివిధ జాతీయ ఇండియా మాస్టర్ అథ్లెటిక్స్ ఓపెన్ మీట్ పరుగు పందెంలో 100, 200, 400 800, 1500 మీటర్ల రిలే వివిధ విభాగాల్లో పాల్గొని ఇప్పటి వరకు మొత్తం 68పతకాలు సాధించారు.


ఫ్యాప్టో చైర్మన్ సాయి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న అనిల్ కుమార్

విద్యార్థులకు ఏఐ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తా

తాడేపల్లిగూడెం రూరల్, డిసెంబరు 9.(ఆంధ్రజ్యోతి):జిల్లాలో విద్యార్థులకు మెరుగైన సాంకేతికత అందించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తానని ప్రవాసాంధుడు, స్టిక్‌బుక్ సీఈవో జూపల్లి అనిల్‌కుమార్ పేర్కొన్నారు. పెంటపాడు పోస్ట్‌బేసిక్ స్కూల్‌లో విద్యార్థులకు ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయడంతోపాటు గురుసత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు, జిల్లా విద్యాశాఖాధికారి నారాయణ పాల్గొని ప్రవాసాంధ్రుడు అనిల్‌ను అభినందించారు. అనంతరం డీఈవో నారాయణ, పోస్ట్‌బేసిక్ స్కూల్ హెచ్‌ఎం రాజేష్, డీవైఈవో రామాంజనేయులు, ఏపీ ఫ్యాప్టో చైర్మన్ సాయి శ్రీనివాస్ తదితరులను సత్కరించారు.

జిల్లా సైన్స్ ఫెయిర్‌కు తేతలి విద్యార్థుల ఎంపిక


జిల్లా సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైన విద్యార్థినీలతో గైడ్ టీచర్ గోపాల్‌రెడ్డి

తణుకు రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తణుకు మండల స్థాయిలో నిర్వహించిన విజ్ఞా వైజ్ఞానిక ప్రదర్శనలో తేతలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన 'ఆపరేషన్ గోదావరి' అనే సైన్స్ ప్రదర్శన జిల్లా స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం కేఎస్‌వీవీ ప్రసాద్ తెలిపారు. మంగళవారం తణుకులోని బాలుర ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడు బీఎం గోపాల రెడ్డి మార్గదర్శకత్వంలో విద్యార్థులు మధ్యాహ్నపు సంధ్య, జొన్నాడ దివ్యలు రూపొందించి ప్రదర్శించిన 'ఆపరేషన్ గోదావరి' ప్రదర్శన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను, గైడ్ టీచర్‌ను డీవైఈవో డీ మురళీ సత్యనారాయణ, హెచ్‌ఎం ప్రసాద్ తదితరులు అభినందించారు

ఏపీ నిట్ ఆచార్యులకు అవార్డులు


నిట్‌లో అవార్డులు అందుకున్నవారిని సన్మానిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి):ఏపీ నిట్‌లో సేవలందిస్తున్న ఇద్దరు ఆచార్యులతోపాటు ఒక విద్యార్థినికి అవార్డులు వరించాయి. ఆయా అవార్డులను వేర్వేరుచోట్ల నిర్వహించిన కార్యక్రమాల్లో వీరు అందుకున్నారు. సంస్థలోని మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ఆచార్యులు డాక్టర్ రఫీ మొహ్మద్ హైదరాబాద్‌లోని ఇండియన్ ఇనిస్టూట్ మెటల్స్ (ఐఐఎం)నిర్వాహకుల నుంచి బెస్ట్ స్టూడెంట్స్ అఫ్లియేట్ చాప్టర్ అవార్డును, ఇదే విభాగానికి చెందిన విద్యార్థిని జయస్మితాకే ప్రతాప్ బెస్ట్ స్టూడెంట్ అవార్డుకు ఎంపికయ్యారు. వీరు ఇండియన్ ఇనిస్టిట్యూట్ మెటల్ నిర్వాహకులు ఈనెల 4 నుంచి 6వరకు హైదరాబాద్‌లో నిర్వహించిన 79వ వార్షిక సాంకేతిక సమావేశంలో ఐఐఎం అధ్యక్షుడు, ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ బీఎస్‌మూర్తి, ఐఎంఎం వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కమల్ కపూర్, మిదాని చైర్మన్ డాక్టర్ ఎస్‌వీఎస్ నారాయణమూర్తి చేతులు మీదుగా పురస్కారాలను అందుకున్నారు. స్టూడెంటట్స్ చాప్టర్ యాక్టివిటీస్‌లో దేశంలోనే అత్యుత్తమ పనితీరును కనబరిచినందకు డాక్టర్ రఫీ మోహమ్మద్‌కు వరించింది. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ గుగులోతు సంతోష్‌కుమార్ చంద్రదీప్‌కు సోలార్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సీడీఎస్ఆర్ఐ) భారత రత్న ఎంఎస్‌స్వామినాథన్ గ్రీన్ ఎక్స్‌లెన్స్ అవార్డును తెలంగాణా గవర్నర్ జిష్ణువేవ్‌వర్మ చేతులు మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా వీరిని ఏపీ నిట్ అధికారులు అభినందించారు.

కర్రసాములో భగత్ సామ్రాట్ ప్రతిభ



దెందులూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : దేశవాళీ క్రీడ అయిన కర్రసాములో ఏపీ కుర్రాడు గోల్డ్‌మెడల్ సాధించాడు. దెందులూరు మండలం గోపన్నపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని వేగవరం గ్రామానికి చెందిన కానిస్టేబుల్ మోర్ల రాంబాబు కుమారుడు భగత్ సామ్రాట్ గుంటూరు జిల్లాలో బుధవారం జరిగిన రాష్ట్రస్థాయి కర్రసాము పోటీల్లో ఏపీ సౌత్ జోన్ సేలాంబం ఛాంపియన్‌షిప్ 2025 సాధించాడు. ఈ సందర్భంగా భగత్ సామ్రాట్‌కు గోల్డ్‌మెడల్ ను అందుకున్నాడని ఏపీ కర్రసాము కోచ్ వెంకన్న తెలిపారు

కరాటేలో సుహాస్ ప్రతిభ



ఏలూరు రూరల్, డిసెంబరు 8, (ఆంధ్రజ్యోతి):స్థానిక అమలోధ్భవి పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్న లక్కపాము సుహాస్ కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చుతున్నాడు. తూర్పు గోదావరి జిల్లా అనపర్తిలో జరిగిన అటల్‌జి ఆంధ్రప్రదేశ్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొని రజిత పతకం సాధించాడు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిస్టర్ క్లారా, పీఈటి రెడ్డి, ఉపాధ్యాయుని లక్ష్మీ, కోచ్ దామిని తదితరులు అభినందించారు.

రైతులకు సాంకేతిక పరిజ్ఞానం అందిద్దాం


ఉద్యాన వర్సిటీతో ఎంవోయు.. తూర్పు గోదావరి కలెక్టర్ కీర్తి, ఉద్యాన అధికారులు

తాడేపల్లిగూడెం రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటల్లో సాంకేతిక పరిజ్ఞానం రైతులకు చేరవేసేలా చర్యలు చేపట్టేందుకు సంయుక్త ఒప్పందాలు దోహదపడతాయని తూర్పు గోదావరి కలెక్టర్ చేకూరి కీర్తి పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం, రాజమండ్రికి చెందిన రతన్ టాటాఇన్నొవేషన్ హబ్‌లు సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి కోసం చేపట్టిన ఎంవోయు కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి మాట్లాడుతూ ఉద్యాన ఉత్పత్తులను వాణిజ్యపరంగా ఉత్పత్తి పెంచేందుకు, వినియోగదా రులకు తక్కువ ధరకు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ దిశగా తూర్పుగోదావరి ఉద్యానపరంగా అభివృద్ధి చెందెందుకు ఎక్కువ అవకాశం ఉందని పేర్కొన్నారు. రెండు సంస్థల మధ్య ఈ అవగాహన ఒప్పందం ఉద్యాన రంగం అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, డైరెక్టర్ ధనుంజయరావు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు,

కరాటేలో మెరిసిన మోగల్లు విద్యార్థి



పాలకోడేరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కాకినాడ జిల్లా అనపర్తిలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-17 కరాటే పోటీల్లో పాలకోడేరు మండలం మోగల్లు ఏఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి ఆర్.వేణు ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నట్లు ఆ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు కె.సూర్య తెలిపారు. బహుమతి సాధించిన విద్యార్థిని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.త్రినాథ్ ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.


వేల్పూరులో వరి పనల నుంచి కంకులను వేరు చేస్తున్న రైతులు.. కంకులను జడలుగా అల్లుతున్న రైతులు

ప్రకృతి నేస్తాలు.. పక్షులు!

ప్రకృతి అందాలు పక్షులు. ప్రతి రోజు మన చుట్టూ తిరుగుతూ కిలకిలరావాలతో అలరిస్తుంటాయి. అలాంటి పక్షులకు నేడు కూడు, గూడు కరువైంది. పట్టణీకరణ నేపథ్యంలో పక్షుల ఆవాసాలకు ప్రమాదం ఏర్పడింది. ఇలాంటి తరుణంలో పక్షుల ప్రేమికులు వాటి రక్షణకు చర్యలు తీసుకుంటుండటం అభినందనీయం. రైతులు కూడా తమ వంతుగా పక్షులు బ్రతకడానికి కృషి చేస్తున్నారు. ఇళ్లు, దేవాలయాలు తదితర ప్రాంతాల్లో పక్షులకు గూళ్లు ఆహారం అందించే ఏర్పాట్లు చేస్తుండటం అక్కడక్కడా మనం చూస్తుంటాం.


అల్లిన వరి కంకులు

- ఆహారం అందించడానికి వరి కంకుల కుచ్చులు
- తయారీలో కళాత్మకం, ఆకర్షణీయం
- వేల్పూరులో పక్షి ప్రేమిక రైతులు

తణుకు రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి):మన పూర్వీకుల కాలం నుంచి గ్రామీణ ప్రాంతాల రైతులు తమ మొదటి వరి పంట కంకుళ్లు పక్షులకు ఆహారంగా పెద్ద మండువా లోగిళ్లు, దేవాయాల వద్ద, సత్రా ల వద్ద వేలాడదీయడం ఆనవాయితీ వుండేది. అయితే కాల క్రమంలో జీవన విధానంలో వచ్చిన మార్పులు కారణంగా వరి కంకుల కుచ్చులను తయారు చేసే కళ తగ్గిపోవడంతో చాలా వరకు తగ్గిపోయింది. ప్రస్తుతం అక్కడక్కడ కొన్ని గ్రామాల్లోని పాత తరం రైతులు ఇంకా శ్రద్ధ వహించి వరి కంకులను కుచ్చులుగా తయారు చేస్తున్నారు. తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలో రైతులు వినాయకుని గుడి వద్ద సార్వా పంటకు సంబంధించిన వరి పనలను సేకరించి వాటిని శుభ్రం చేసి జడలుగా అల్లిన జడలను కుచ్చులుగా తయారు చేసి వాటిని దేవాలయాల వద్ద పిచ్చుకలు వచ్చి తినేలా వేలాడదీస్తున్నారు. వరి కంకులను ఒక జడలా అల్లడం ఒక కళగా వుంటుంది. అలా జడగా అల్లిన వరి కంకుల జడలను ఒక కుచ్చులా అమర్చడం అనేది ఒక కళాత్మకమైనది. దీనిని గ్రామీణ రైతులు ఎంతో నైపుణ్యంతో, నేర్పుతో తయారు చేస్తారు.

మద్ది ఆంజనేయస్వామికి భక్తుల తాకిడి


అలంకరణలో ఆంజనేయ స్వామి

జంగారెడ్డిగూడెం రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామిని మంగళవారం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. స్వామి వారికి అష్టోత్తర పూజలు, అన్నప్రాసనలు, 108 ప్రదక్షిణలతో మొక్కులు తీర్చుకున్నారు. స్వామి వారి దర్శనార్థం వచ్చిన భక్తులు 2295 మందికి దేవస్థాన నిత్యాన్నదాన సత్రంలో అన్న ప్రసాదాలను అందజేశారు. మంగళవారం ఒక్కరోజే ఆలయానికి వివిధ సేవల రూపంలో రూ.2,20,160 ఆదాయం లభించినట్టు ఈవో చందన తెలిపారు.


తూర్పువీధిలో గంగానమ్మకు సారె సమర్పిస్తున్న భక్తులు

కోలాహలంగా జాతర

ఏలూరు కార్పొరేషన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి):స్థానిక తూర్పు వీధిలోని గంగానమ్మ ఆలయంలో జరుగుతున్న జాతర మహోత్సవాల్లో భాగంగా మంగళవారం తూర్పువీధికి చెందిన భక్తులు 101 మంది మేళతాళాలు, బాజాభజంత్రీలు, వివిధ రకాల పదార్థాలు, పండ్లు, పుష్పాలతో ర్యాలీగా ప్రదర్శన జరిపి అమ్మవారికి సారెను సమర్పించారు. ఈ సందర్భంగా మేడల్లో ఉన్న అమ్మవారిని జాతర కమిటీ అధ్యక్షులు వంకినేని భానుప్రకాష్, జిల్లెళ్ళమూడి నరసింహారావు, మాజీ కార్పొరేటర్ మారం హనుమంతరావు మిత్రబృందం దర్శించుకుని పసుపు, కుంకుమలతో అర్చనలు జరిపి గీతాలను ఆలపించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

తడికలపూడిలో చెరువుల ఆక్రమణ


చెరువుగట్లు ఆక్రమించారని రైతులు చెబుతున్న ఇళ్లు

- పీజీఆర్ఎస్‌లో ఐదుసార్లు ఫిర్యాదు చేసినా
- ఫలితం శూన్యం.. రైతుల ఆవేదన


వినతిపత్రం అందజేసిన తడికలపూడి రైతులు

ఏలూరు రూరల్, డిసెంబరు 9, (ఆంధ్రజ్యోతి): గ్రామంలో సాగునీటి, తాగునీటి చెరువులు ఆక్రమణకు గురయ్యాయని పీజీఆర్ఎస్‌లోను, అధికారుల దృష్టికి తీసుకువెళ్ళినా ఫలితం ఉండడం లేదని కామవరపుకోట మండలం తడికలపూడి గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్రమణకు గురైన స్థలాలను స్వాధీనం చేసుకోవాలని కోరుతూ గ్రామస్థులు జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక గౌడ్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామస్థులు ఎం.సుందర్రావు, ఎన్.శ్రీనివాసరావు, బీవీవీ ప్రసాదరావు, ఐ.సుధాకర్‌రావు, వై.సురేష్ మాట్లాడుతూ కామవరపు కోట మండలం తడికలపూడి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న కొత్త చెరువు, ధర్మకోనేరు, నాగుల చెరువు, అంకాలమ్మ చెరువు, సుబ్బులకుంట, ఆక్రమణలకు గురయ్యారని పేర్కొన్నారు. కొత్త చెరువు చుట్టూ కొందరు రైతులు ఆక్రమించుకొని ధర్మకోనేరు చెరువుగట్టు నుంచి దళిత కాలనీ మీదుగా పొలాల్లోకి వెళ్ళేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. రోడ్డుకు ఇరువైపులా ఇళ్ళ కట్టేశారని నాగుల చెరువు చుట్టూ సైతం ఇళ్ల ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. ప్రతి చెరువు చుట్టూ ఆక్రమణలకు గురయ్యారని పీజీఆర్ఎస్‌లో ఇప్పటికే ఐదుసార్లు ఫిర్యాదు చేసినా ఏ ఒక్క అధికారి పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ మొర ఎవరు ఆలకించడం లేదని ఫలితంగా గ్రామస్థులు తీవ్ర ఇక్కట్లు పాలవుతున్నారని ఆరోపించారు. పీజీఆర్ఎస్‌లో అర్జీ స్వీకరిస్తున్నారే తప్ప స్పందించడం లేదని ఐదు చెరువులు కూడా సర్వే చేయించి సరిహద్దులు నిర్ధారించాలని తక్షణం ఆక్రమణ తొలగించాలంటూ విజ్ఞప్తి చేశారు.

జాతీయ స్విమ్మింగ్‌కు హాఖిల్ ఎంపిక


హాఖిల్‌ను అభినందిస్తున్న యాజమాన్యం

ఏలూరు,డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి):స్థానిక అగ్రహారంలో ఆదిత్య డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న ఎస్‌కే హాఖిల్ జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. త్వరలో జరిగే జాతీయ పోటీల్లో బరిలో దిగనున్నాడు. ఈ సందర్భంగా ఆదిత్య సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ ఎన్.సుగుణరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ వి.సుభాష్‌లు హాఖిల్‌ను అభినందించారు.

శంబాలా సోషల్ ఫ్యాంటసీ సినిమా

ఏలూరు రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి):హర్రర్, సోషల్ ఫ్యాంటసీ ఎలివేషన్లతో మంచి కథతో శంబాల సినిమాగా మీ ముందుకు వస్తున్నామని హీరో ఆది తెలిపారు. ఈనెల 25వ తేదీన చిత్రం విడుదల కానుంది. చిత్ర ప్రమోషన్‌లో భాగంగా శంబాల మూవీ సినీ బృందం పడమర వీధి గంగానమ్మను దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. జాతర కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. జాతర విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హీరో ఆది మాట్లాడుతూ అమ్మవారిని దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. హీరోయిన్ అర్చన, నటుడు ఇంద్రనీల్ మాట్లాడుతూ చిత్రం అఖండ విజయం సాధించాలని అమ్మవారి ఆశీస్సులు తమకు ఎప్పుడు ఉండాలని కోరుతున్నట్లు తెలిపారు.



చాట్రాయిలో మాట్లాడుతున్న డీసీ శ్రీలత

సారా విక్రయాలు వదిలేస్తే ఉపాధి

చాట్రాయి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి):సారా విక్రయాలు వదిలేస్తేనవోదయం 2.0లో భాగం గా మార్పు పథకం ద్వారా గౌరవప్రదంగా జీవించటానికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఏలూరు జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బోయపాటి శ్రీలత, అసిస్టెంట్ కమిషనర్ కేవీఎన్ ప్రభుకుమార్ అన్నారు. చాట్రాయి ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో అధికారులు మాట్లాడుతూ గతంలో సారా తయారీ, అమ్మకం, రవాణా వంటి అక్రమ కార్యకలాపాలు మానుకుని సక్రమ జీవనం సాగించే కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. వారికి ఆసక్తి ఉన్న వృత్తులకు వెలుగు, బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి ఆర్థికాభివృద్ధి చెందేలా ప్రోత్సహిస్తామని, వీరి కుటుంబాలలో విద్యావంతులైన పిల్లలుంటే జాబ్‌మేళా ద్వారా ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పారు. జిల్లా ఎక్సైజ్ అధికారి ఆవులయ్య, డీఆర్‌డీఏ ఏపీడీ అనిత, ఏజీఎం చెన్నకేశవులు, ఎంపీడీవో రాజు, నూజివీడు, కైకలూరు ఎక్సైజ్ సీఐలు మస్తానయ్య, షేక్ రమేష్, సారా వృత్తిని మానిన వారు పాల్గొన్నారు.



తేతలి లేహం ఫుడ్ ఫ్యాక్టరీ వెనుక గేటు వద్ద పరిశీలిస్తున్న దృశ్యం

తేతలి లేహం ఫుడ్ ఫ్యాక్టరీ తనిఖీ

తణుకు రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): తేతలిలోని లేహం ఫుడ్ ప్రొడక్ట్స్ సంస్థలో మంగళవారం కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఫ్యాక్టరీ వ్యర్థాల కారణంగా ఆ పరిసరాల్లో దుర్వాసనతో తాము ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు కొంత కాలంగా ఆందోళనలు నిర్వహించారు. అయినా అధికారులు స్పందించకపోవడంతో సీఎం చంద్రబాబుకు బాధితుల తరఫున సజ్జాపురానికి చెందిన బీజేపీ నాయకుడు రేపాక సూర్య రామారావు నేరుగా ఫిర్యాదు చేయడంతో జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు మంగళవారం సంస్థలో తనిఖీలు నిర్వహించారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారి ఎన్. వెంకటరమణ ఫిర్యాదుదారుతో కలసి సంస్థ వెనుక వైపు పొలాలు, గేటు ప్రాంతాన్ని పరిశీలించారు. కాలుష్య నియంత్రణ అధికారి వెంకట రమణ మాట్లాడుతూ సంస్థ యాజమాన్యానికి 15 రోజుల్లో సమస్య పరిష్కరించుకోవాలని గడువిచ్చినట్టు తెలిపారు.

రాయగడ ఎక్స్‌ప్రెస్‌కు అదనపు కోచ్‌లు

ఏలూరు క్రైం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి):గుంటూరు నుంచి రాయగడ వెళ్లే నంబరు 17243, రాయగడ నుంచి గుంటూరు వెళ్లే నంబరు 17244 రైళ్లకు ప్రయాణికుల రద్దీ దృష్ట్యా అదనపు బోగీలను ఏర్పాటు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వేశాఖ అధికారులు వెల్లడించారు. ఈ రైల్‌లో ఇప్పటి వరకూ 20 బోగీలు ఉండగా అదనంగా మరో నాలుగు బోగీలను శాశ్వతంగా ఆ రైళ్ళకు ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకూ సెకండ్ క్లాస్ ఏసీ ఆ రైల్‌లో లేదు. ఇప్పుడు ఒక బోగీని ఏర్పాటు చేశారు. త్రీ టైర్ ఏసీలు మూడు ఉన్నాయి. స్లీపర్ క్లాస్ కోచ్‌లు 12 ఉండగా అదనంగా మరో రెండు కోచ్‌లు ఏర్పాటు చేశారు. జనరల్ సెకండ్ క్లాస్ బోగీలు రెండు ఉండగా అదనంగా మరో రెండు బోగీలను ఏర్పాటు చేశారు. ఎస్ఎల్ఆర్ (సీటింగ్ కమ్ లగేజ్ ర్యాక్) బోగీలు రెండు ఉన్నాయి. అదనంగా మొత్తం నాలుగు బోగీలను పెంచారు.

ఆక్రమణలో ఉన్న దేవస్థానం భూమి స్వాధీనం



దేవస్థానం భూమిని స్వాధీనం చేసుకుని హెచ్చరిక బ్యానర్‌ను ప్రదర్శిస్తున్న అధికారులు

దెందులూరు, డిసెం బరు 9 (ఆంధ్రజ్యోతి): శ్రీరామవరంలో ఆక్రమణదారుల చేతుల్లో ఉన్న దేవస్థానం భూమిని అధికారులు స్వాధీనం చేసుకున్నా రు. గ్రామంలో సీతా రామ స్వామి దేవ స్థానానికి చెందిన భూమి ఆర్ఎస్ నెంబరు 171, 172 సర్వే నెంబరులో ఉన్న 5 ఎకరాల 75 సెంట్ల భూమి 60 సంవత్సరాల క్రితం అదే గ్రామానికి చెందిన దాత కామిరెడ్డి దేవ స్థానానికి 5 ఎకరాల 75 సెంట్ల భూమిని దేవస్థానంతో పాటు తన వారసులకు కూడా ఉమ్మడి అధికారం ఉండే విధంగా వీలునామా రాశారు. అయితే భవిష్యత్తులో తన వారసులకు చెడు ఆలోచ నలు కలిగి దేవస్థానం భూమిని తన భూమేనని అడ్డం తిరిగితే ఆ భూమి దేవస్థానం భూమిగా మాత్రమే చెందుతుందని వీలునామ రాశారు. ఈ నేపథ్యంలో దాత వారసుడు 1987 సంవత్సరంలో తన పేరు మీద ఆన్‌లైన్ చేయించి ఇళ్ల స్థలాలకు అమ్మేందుకు పనులు ప్రారంభించారు. దీంతో అదే గ్రామానికి చెందిన భాస్కర్ అనే వ్యక్తి దీనిపై 2021 సంవత్సరం కోర్టును ఆశ్రయించారు. కోర్టు దీనిపై పూర్తిగా పరిశీలించి దేవస్థానికి చెందిన భూమిగా 2023 సంవత్సరం లో తీర్పు చెప్పింది. అయితే అప్పుడు వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో వైసీపీ సానుభూతి పరుడుగా ఉండటంతో ఆ దేవస్థానం భూమిని దేవస్థానం అధికారులు స్వాధీనం చేసుకునే ధైర్యం చేయ్యలేదు.అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కోర్టు తీర్పు అమలుకు చర్యలు తీసుకున్నారు. ఈ భూమి విలువ సుమారుగా రూ.4 కోట్ల వరకు ఉంటుంది. మంగళవారం దేవస్థానం భూమిని స్వాధీనం చేసుకున్నట్లు దేవదాయశాఖ అధికారి కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. శ్రీసీతారామస్వామి దేవస్థానం భూమిగా హెచ్చరిక బోర్డును అధికారులు ఏర్పాటు చేశారు.

పేకాట కేసులో పది మంది అరెస్టు

పెదపాడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పెదపాడు మండలం వేంపాడు గ్రామంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి 10 మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లుగా పెదపాడు ఎస్సై కట్టా శారదా సతీష్ తెలిపారు. పేకాటరాయుళ్లతో పాటుగా రూ.17,890 నగదు, 10 సెల్‌ఫోన్లు, 8 మోటారుసైకిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.



మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను సన్మానిస్తున్న విప్ బొలిశెట్టి



బొబ్బిలి వంతెన మరమ్మతులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

అభివృద్ధి పథంలో రాష్ట్రం : మంత్రి సుభాష్

తాడేపల్లిగూడెం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కార్మిక, పరిశ్రమల శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్‌తో భేటీ అయ్యారు. మంగళవారం విప్ నివాసంలో వీరు చర్చించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఐదేళ్లుగా తాడేపల్లిగూడెం అభివృద్ధికి దూరంగా ఉందని, నేడు దాతలు, ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి జరగడం అభినందనీయమన్నారు. పీ4లో భాగంగా తాడేపల్లిగూ డెంలో చేపట్టిన స్విమ్మింగ్‌ఫూల్, ఇండోర్ స్టేడి యం, జిల్లా పరిషత్ హైస్కూలో గ్రౌండ్ పనులు దాదాపు పూర్తి కావచ్చాయన్నారు. వీటిని త్వరలో ప్రారంభిస్తారని వెల్లడించారు. రాష్ట్రాని కి పెట్టుబడులు వస్తున్నాయని, రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం అభివృద్ధి పథంలో నడుపుతున్నారన్నారు.

వలవల బాబ్జితో మంత్రి భేటీ..

అనంతరం మంత్రి సుభాష్‌ను విప్ బొలిశెట్టి సన్మానించారు. అనంతరం మంత్రి రాష్ట్ర భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ వలవల బాబ్జిని కలిశారు. కార్మిక విషయాలపై చర్చించారు. టీడీపీ నాయకుడు గొర్రెల శ్రీధర్, పట్నాల రాంపండు, గురుజు సూరిబాబు, పద్మనాభుని మురళీమోహన్ పాల్గొన్నారు.

బొబ్బిలి వంతెన పనులు వేగం కావాలి : ఎమ్మెల్యే పత్సమట్ల

గణపవరం: ఏలూరు - పశ్చిమగోదావరి జిల్లాలకు వారధిగా ఉన్న గణపవరం బొబ్బిలి వంతెన పనులు నాణ్యతగా పూర్తి చేయాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు కోరారు. గణపవరం వెంకయ్య వయ్యేరుపై ఉన్న బొబ్బిలి వంతెన శిథిలావస్థకు చేరడంతో ఎమ్మెల్యే సమకూర్చిన నిధులతో మరమ్మతులు చేపట్టారు. పనులను ఎమ్మెల్యే ధర్మరాజు మంగళవారం పరిశీలించి మాట్లాడుతూ ఈ వంతెన శిథిలమైతే ప్రమాదాలు సంభవించే అవకాశం ఉండటంతో ముందస్తుగా మరమ్మతులు ప్రారంభించామని, రెండు జిల్లాలకు ఆక్వా, ధాన్యం రవాణాకు ఆవశ్యకమన్నారు. వంతెన మరమ్మతులు సత్వరమే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట సర్పంచ్ మూరా అలంకారం, గణపవరం, నిడమర్రు జనసేన మండల అధ్యక్షుడు తోట శ్రీనివాసరావు, నిమ్మల దొరబాబు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు సురేంద్రకుమార్ రాజు, ప్రవాసాంధ్రుడు కొనిశెట్టి గణేశ్, పుర ప్రముఖుడు జంపన శ్రీనివాసరాజు, పంచాయతీ కార్యదర్శి శివరామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జేసీ అభిషేక్ గౌడ

రైతు ఉత్పత్తిదారుల సంఘాలు

ప్రగతికి సహకరించండి : జేసీ

ఏలూరు సిటీ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి):జిల్లాలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ప్రగతిని సాధించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎంజె అభిషేక గౌడ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం రైతు ఉత్పత్తిదారుల సంఘాల జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశం జేసీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వ్యవసాయ ప్రధానమైన ఏలూరు జిల్లాలో కోకో, ఆయిల్‌పామ్, కొబ్బరి, మామిడి తదితర ఉత్పత్తులతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పేందుకు అనువైన పరిస్థితులు ఉన్నాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహకాలు అందిస్తున్నాయని, ఈ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాట్లలో జిల్లా మంచి పురోగతి సాధించేలా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు చర్యలు తీసుకోవాలన్నారు. జడ్పీ ఇన్‌చార్జి సీఈఓ కె.భీమేశ్వర్, డీసీఓ ఆరిమిల్లి శ్రీనివాస్, డీఆర్‌డీఏ పీడీ ఆర్ విజయరాజు, నాబార్డ్ డీడీఎం అనిల్ కాంత్, ఎల్‌డీఎం నీలాద్రి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి షేక్ హబీబ్ బాషా, ఉద్యాన శాఖ డీడీ షాజా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆచంట ఐటీఐలో జాబ్ మేళా

ఆచంట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి):ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ కెరియర్ సర్వీస్ ఆధ్వర్యంలో ఆచంటలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఐవీ సత్యనారాయణరాజు తెలిపారు. ఈ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో కియా ఇండియా, బ్లూ క్లైమేట్ లిమిటెడ్, అపోలో పార్మసి, టాటా ఎలక్ట్రానిక్స్, పవన్ సొల్యూషన్ వంటి సంస్థల్లో అవకాశాలు కల్పిస్తామని, 18 నుంచి 28 ఏళ్ల వయస్సు గల యువతీ యువకులు బుధవారం ఉదయం 10 గంటలు కల్లా హాజరుకావాలన్నారు. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకుని ఇంటర్వ్యూకి రెజ్యూమ్‌తో సహా హాజరు కావాలని, వివరాలకు మనోజ్ నెంబర్‌లో 63049 22617 సంప్రదించాలన్నారు.



చెక్కును అందిస్తున్న కాశీ విశ్వనాథరాజు

భవన నిర్మాణానికి రూ. 25 లక్షల విరాళం

భీమవరంటౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ భవన నిర్మాణానికి ఆర్థిక సాయం చేయాలని ప్రముఖ వ్యాపారవేత్త ఉద్దరాజు ఆనంద రాజు ఫౌండేషన్ ఛైర్మన్ ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజును కోరగా రూ. 25 లక్షల విరాళం ప్రకటించారని, జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్ర రాజు తెలిపారు. తక్షణం రూ. 10 లక్షల చెక్కును అందించారని విశ్వనాథరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు జి. జకరయ్య, జిల్లా నాయకులు శ్యామ్, సుందర్ రావు, పుల్లయ్య పాల్గొన్నారు.



మీడియాకు వివరాలు తెలుపుతున్న డ్వాక్రా గ్రూపు సభ్యులు

మరో అవినీతి బాగోతం

మరో ఆర్పీ రూ.9 లక్షలపైనే గోల్‌మాల్

ఆకివీడు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి):డ్వాక్రా సభ్యుల సొమ్ము స్వాహా చేసిన రిసోర్స్ పర్సన్ సుధ వ్యవహారం కొలిక్కి రాకముందే మరో ఆర్పీ మోసం బయటకు వచ్చింది. సమతానగర్‌కు చెందిన వి.హేమలత లక్షల్లో మోసం చేసిందని సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని, అధికారులను ప్రశ్నించగా సుధ వ్యవహారం పూర్తి కానివ్వండి వాళ్ళది కూడా చూస్తామంటున్నారు. యూనియన్ బ్యాంకులో మూడో రోజు మంగళవారం రీజనల్ అధికారులు ఖాతాలు తనిఖీలు చేస్తున్నారు. సుధ అవినీతి రూ. కోటి దాటినట్లు తెలుస్తోంది. హేమలతకు యూనియన్ బ్యాంకులో-16, ఎస్బీహెచ్‌లో-8, బరోడా బ్యాంకులో-1, ఎస్బీఐలో-2 గ్రూప్‌లు ఉన్నాయి. యూనియన్ బ్యాంకులో మేరీ గ్రూప్‌లో రూ.6.80 లక్షలు, వెన్నెల గ్రూప్‌లో రూ2.50 లక్షలు తమను మోసం చేసిందని లీడర్లు, సభ్యులు ఆరోపించారు. తనిఖీలు చేస్తే కాని పూర్తి వివరాలు తెలియవు. ఉమ్మడి జిల్లాలోని బ్యాంకుల అధికారులు డ్వాక్రా అకౌంట్లు పరిశీలిస్తున్నారు. బాధితులకు న్యాయం చేయాలని ఐద్వా సభ్యులు కోరారు.

స.హ. చట్టం కక్షిదారులకు ఉపయోగం

ఏలూరు జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు



సదస్సులో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ కె.శ్రీనివాసరావు

ఏలూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి):సమాచార హక్కుచట్టం ద్వారా భూముల క్రయ, విక్రయాలపై సమగ్ర సమాచారం తెలుసుకున్న తర్వాతే రిజిస్ట్రేషన్ల చేసుకోవడం మంచిదని, రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అందరికీ సమాచారం అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు జిల్లా రిజిస్ట్రార్ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఏలూరు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏపీ రిజిస్ట్రేషన్స్ జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో వివిధ వివరాలను సరిచూసుకోవడానికి మాత్రమే ఉపయో గపడుతుందని, ఈసీలు, ఇతర డాక్యుమెంట్లను పొందాలంటే తగినంత రుసుం చెల్లించి తమ కార్యాలయాల్లో పొందవచ్చునన్నారు. సబ్ రిజిస్ట్రార్ బి. లావణ్య, సుధాకర్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కక్షిదారులు

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ఏలూరు క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు నగరంలో రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, వారెవరైనా మితిమీరితే కఠిన చర్యలు తప్పవని ఏలూ రు టౌన్ సీఐ జి.సత్యనారాయణ హెచ్చరించారు. ఏలూరు వన్‌టౌన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లకు సీఐ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏలూరు నగరంలో ప్రస్తుతం జాతర జరుగుతున్న క్రమంలో ఎవరైనా కార్యకలాపాలు నిర్వహించేందుకు ప్రయత్నం చేసేత వారిపై నగర బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉంటే వారిపై ఉన్న షీటును తొలగించేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామన్నారు. నగరంలో ఉన్న రౌడీషీటర్లపై ఎప్పటికప్పుడు నిఘా ఉంటుందని, ఎవరైనా తోక జాడిస్తే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్ఐలు సీహెచ్ కె.దుర్గా ప్రసాద్, వై.సుధాకర్ హాజరయ్యారు.



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సత్యనారాయణ

కోడి పందేలపై దాడి

టి.నరసాపురం, డిసెంబరు 9, (ఆంధ్రజ్యోతి): కోడి పందాలు నిర్వహిస్తున్న ఎనిమిది మంది వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఎం.జయబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మర్రిగూడెం గ్రామ శివార్లలో కోడిపందేలు, జూద కార్యకలాపాలు జరుగుతున్నట్టు సమాచారం రావడంతో తన సిబ్బందితో దాడి నిర్వహించి ఎనిమిది మంది వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద రూ.9100 నగదు, మూడు కోడి పుంజులు, రెండు కోడి కత్తులు సీజ్ చేసి వారి పై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

భీమడోలు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పొలంలో 10 వేల విలువైన ట్రాన్స్‌ఫార్మర్ చోరీ చేసిన ఘటనపై భీమడోలు పోలీసులు కేసు నమోదు చేశారు. భీమడోలు మండలం పోలసానపల్లి పంచాయతీ ఆంజనేయనగరం ప్రాంతంలోని రైతు యర్రమిల్లి లక్ష్మీ కామేశ్వరి పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్‌ని గుర్తు తెలియని దుండగులు ఈనెల 7వ తేదీ రాత్రి ఎత్తుకెళ్ళిపోయారని రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

భీమడోలు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భార్యను అనుమానంతో వేధింపులకు గురి చేస్తున్న భర్తపై కేసు నమోదు చేసినట్లు భీమడోలు పోలీసులు తెలిపారు. సూరప్పగూడెంకు చెందిన నిర్మల వినీలతో అశ్వారావుపేట, నారాయణపురంకు చెందిన సురేష్‌కు 15 సంవత్సరాల క్రితం వివాహం కాగా భర్త నిత్యం భార్యపై అనుమానంతో వేధింపులకు గురి చేస్తుండడంతో భార్య కొంత కాలంగా పుట్టింట్లో ఉంటుంది. వేధింపులపై భార్య భీమడోలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళ మెడలో చైన్ స్నాచింగ్

మొగల్తూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి):మహిళ మెడలో గుర్తుతెలియని దుండగుడు రెండు కాసుల బంగారు గొలుసు దొంగించుకుని పారిపోయాడు. మొగల్తూరు ఎస్ఐ వై.నాగలక్ష్మీ తెలిపిన వివరాల ప్రకారం కెపిపాలెం నార్త్ గ్రామానికి చెందిన పోతాబత్తుల రామలక్ష్మి ఒంటరిగా ఇంటిలో జీవిస్తుంది. సోమవారం గ్రామంలోని ఒక కొబ్బరి తోటలో పని చేస్తుండగా ఒక వ్యక్తి బైక్‌పై వచ్చి చీపుర్లు అమ్ముతారా అని అడిగి బేరమాడాడు. ఆమె చీపుర్లు కోసం వెనుకకు తిరిగే సరికి ఆమె మెడలో ఉన్న 2 కాసులు బంగారు గొలుసు లాక్కుని బైక్‌పై పరారయ్యాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ నాగలక్ష్మి తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

దెందులూరు,డిసెంబరు 9 (ఆంధ్ర జ్యోతి): అందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ జాగ్రత్తగా వాహనాలు నడపాలని పెదవేగి ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రాజశేఖర్ అన్నారు. బుధవారం మండ లంలోని సోమవరపాడు సూర్యవాటర్ ప్లాంట్ సమీపంలో వాహనదారులకు దెందులూరు ఎస్ఐ ఆర్.శివాజీతో కలిసి ట్రాఫిక్ నిబంధనలు,రోడ్డు భద్రతాపై అవగహన కార్యక్రమం నిర్వహించారు. వాహనదారులు వేగం వద్దని ప్రాణం ముద్దని సీటు బెల్ట్ పెట్టుకోవాలని హెల్మెట్‌ను ధరించాలన్నారు. వాహన తనిఖీలలో భాగంగా సరైన వాహనాల ధ్రువ పత్రాలు కలిగి ఉండి దగ్గర ఉంచుకోవాలన్నారు. వాహనదారులు నిబంధనలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

ధాన్యం కొనుగోళ్లను నిత్యం పర్యవేక్షించాలి

- రైతులను ఇబ్బంది పెట్టొద్దు
- ఆర్డీవో అంబరీష్



ఆరబెట్టిన ధాన్యం పరిశీలిస్తున్న ఆర్డీవో

ముదినేపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్ళ విషయంలో అధికార్లు, రైస్ మిల్లర్లు ప్రభుత్వం నిర్ధేశించిన మార్గదర్శక సూత్రాల ప్రకారం వ్యవహ రించాలని, రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని ఏలూరు ఆర్డీవో అచ్యుత్ అంబరీష్ ఆదేశించారు. మండ లంలోని పెయ్యేరు, పెదగొన్నూరు, కొత్తపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలైన మూడు రైస్ మిల్లులు, వడాలి రైతు సేవా కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీ లించారు. ధాన్యం కొనుగోళ్ళను నిత్యం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు నాణ్యమైన గోనె సంచులనే ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. తేమ శాతం నిర్ధారించే మిషన్‌ను పరిశీలించి తేమ శాతాన్ని నిర్ణయించడంతో ఎటు వంటి పొరపాట్లు జరగకూడదని ఆర్డీవో తెలిపారు. రైస్‌మిల్లుల్లో ధాన్యం నిల్వలను, కొనుగోలు చేసిన ధాన్యం మిల్లింగ్ చేసిన బియ్యాన్ని పరిశీలించారు. మద్దతు ధరను కల్పించే విషయంలో మిల్లర్లు జాగ్రత్తలు పాటించాలన్నారు. సింగరాయ పాలెం, వడాలి, పెదగొన్నూరు ఏరియాల్లో రోడ్ల వెంబడి ఆర బెట్టిన ధాన్యాన్ని పరిశీలించి, 17 శాతం తేమ ఉండే విధంగా ధాన్యాన్ని ఆరబెట్టి మద్దతు ధరను పొందాలని రైతులకు సూచించారు. తహసీల్దార్ లతీఫ్‌పాషా, మం డల ఏఓ వేణుమాధవ్, డీసీఎంఎస్ మండల ఇన్‌ఛార్జి విజయ్, వీఆర్వోలు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

లంక గ్రామాలకు బస్సు ఏర్పాటు చేయరూ..



నాయకర్‌కు సమస్య వివరిస్తున్న దృశ్యం

కలిదిండి, డిసెం బరు 9(ఆంధ్ర జ్యోతి): లంక గ్రామా లైన పెద లంక, పెద పుట్ల పూడి, అప్పారావు పేట గ్రామా లకు నర్సాపురం డిపో బస్సును ఏర్పాటు చేయాలని డీసీ ఛైర్మన్ ముద్దం భోగేశ్వరరావు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాస్ మంగళవారం నర్సాపురం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్‌ను కలిసి విన్నవించారు. ఆయా గ్రామాల నుంచి నిత్యం విద్యార్థులు చదువుకోవడానికి నర్సాపు రంలో కళాశాలలకు వెళ్లి వస్తుంటారని, బస్సులేకపోవడంతో 9 కిలోమీటర్ల మేర నడిచి వెళ్లి గరిసేపూడి అండర్ టన్నల్ వద్ద బస్సులు ఎక్కుతున్నారని దీంతో సమయానికి విద్యార్థులు కళాశాలలకు వెళ్లలేకపోతున్నారని అన్నారు. అందుకు ఎమ్మెల్యే స్పందించి డిపో మేనేజర్‌తో మాట్లాడగా బస్సును త్వరలో ఏర్పాటు చేస్తామన్నారని తెలిపారు.

డెల్టా కాలువలు, డ్రెయిన్లపై లైడార్ సర్వే

మే నెలలోపు రిపోర్టు రూ.13.4 కోట్లతో ఐఐసీటీతో ఒప్పందం: మంత్రి నిమ్మల

రాజమహేంద్రవరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): డెల్టా పంటను ముంపు బారి నుంచి తప్పించే ప్రయత్నాలను ప్రభుత్వం వెతకడం మొదలు పెట్టింది. కాలువల్లో పూడిక, డ్రెయిన్లు సరిగ్గా లేకపోవడం వల్లే ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ పరిధిలోని ఏటా పంట ముంపునకు గురవుతుందని ఆలోచనకు వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారంపై దృష్టి సారించింది. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో అమరావతిలో మంగళవారం ఇరిగేషన్ అధికా రుల సమీక్ష జరి గింది.ఇరిగేషన్ సలహాదారు ఎం.వెంకటేశ్వరావు, ఈఎన్‌సీ నరసింహ మూ ర్తి, డెల్టా సీఈ శేషు బాబు, ఎస్ఈ గోపీనాథ్, ఏలూరు ఎస్ఈ దేవ ప్రసాద్, ఈఈలతో ఈ సమీక్ష జరిగింది. ఈ నెలలోనే సర్వే మొదలవుతుందని, ప్రధాన కాలువలు, డ్రెయి న్లలో పూడిక ఏ స్థాయిలో ఉంది. వాటి పరిస్థితి ఏంటనేది మ్యాప్‌లతో సహా ఈ సర్వే చేయను న్నారు. ధవళేశ్వరం ఇరి గేషన్ సర్కిల్ పరి ధిలోని తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టాలలో మొత్తం ఈ సర్వే జరుగుతుంది ఇరిగేషన్ అధి కారుల సహకారంతో ఐఐసీటీ ఈ సర్వే నిర్వహించనుంది. కాగా డ్రిప్ పథకం కింద సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజి మరమ్మతులకు కేటా యించిన రూ.150 కోట్లతో ఎప్పుడు పనులు మొదల పెడతారనేది సమావేశంలో నిర్ణయించలేదు. సర్వేపైనే ప్రధాన దృష్టి పెట్టడం గమనార్హం.

ఏఐ కంప్యూటర్ ల్యాబ్‌లు

ఏలూరు టూటౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో రూ.2.5 కోట్ల నిధులతో ఏఐ కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ తెలిపారు. యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో జిల్లాకు పరిశ్రమలు తీసుకొచ్చేందుకు కృషి చేస్తునట్లు తెలిపారు. దీనిలో భాగంగానే ఏఐ కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 7 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, నాలుగు పాఠశాలల్లో ల్యాబ్‌లు ఏర్పాటు చేయడానికి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఏఐ ల్యాబ్‌లకు అయ్యే ఖర్చులు భరించేందుకు ఓఎన్‌జీసీ సంస్థను ఒప్పించినట్లు మహేశ్ తెలిపారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం, కామవరపుకోట, కైకలూరు, చింతలపూడి బుట్టాయిగూడెం, నారాయణ డిగ్రీ కాలేజీలు, ఉన్నత పాఠశాలలు అయిన ఏలూరు, బుట్టాయిగూడెం, జంగారెడ్డిగూడెం, రాజవరంలో కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ఆంధ్రజ్యోతి
భీమవరం
భీమవరం, ఉండి, తణుకు, తాడేపల్లిగూడెం, ఆచంట, పాలకొల్లు, నరసాపురం

13న జాతీయ లోక్ అదాలత్

నరసాపురం టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): నరసాపురంలోని అన్ని కోర్టు సముదాయాల్లో ఈనెల 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు న్యాయాధికారి ఎ.వాసంతి తెలిపారు. మంగళవారం ఆమె ఒక ప్రకటనలో వివరాలు తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో క్రిమినల్, ఎక్సైజ్, సివిల్, మోటర్ వాహన ప్రమాద బీమా, కుటుంబ తగదాలు తదితర కేసుల్ని రాజీ చేసుకోవచ్చున్నారు. న్యాయవాదులు, పోలీస్ అధికారులు ఈ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా కృషి చేయాలన్నారు.

12న కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీల ధర్నా

భీమవరం టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 12న అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కల్యాణి తెలిపారు. ఎండి హసీనా బేగం అధ్యక్షతన మంగళవారం జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం జరిగింది. కల్యాణి మాట్లాడుతూ అంగన్వాడీల వేతనాలు పెంచాలని ప్రధాన డిమాండ్ అన్నారు. సమావేశంలో సీహెచ్.ఉషారాణి, కె.తులసి, సీహెచ్ మహాలక్ష్మీ, ఫైడీశ్వరి, మధుశీల, విజయలక్ష్మి, శ్యామల కుమారి, తదితరులు పాల్గొన్నారు.


పోడూరు పీహెచ్‌సీలో గర్భిణుల మధ్య పుట్టినరోజు కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, అనంతలక్ష్మి దంపతులు

పీహెచ్‌సీల్లో గర్భిణులకు నాణ్యమైన వైద్యం

ప్రభుత్వ ఆసుపత్రిలో పితాని జన్మదిన వేడుక

పోడూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీల్లో గర్భిణులకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నామని, సాధారణ ప్రసవాలపై మనోధైర్యం కలిగి ఉండాలని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. ప్రతీనెలా 9న ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రధాన మంత్రి సమృద్ధి మాతృత్వ దినోత్సవం పథకం ద్వారా గర్భిణులకు ప్రత్యేక వైద్య సేవలందిస్తున్నారని. అదే రోజు గర్భిణుల మధ్య తన పుటినరోజు కేక్ కట్ చేయడం అదృష్టంగా భావిస్తున్నాని పితాని అన్నారు. పోడూరు పీహెచ్‌సీలో మంగళవారం టీడీపీ శ్రేణులు, వైద్య సిబ్బంది ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ జన్మదిన వేడుక నిర్వహించారు. ఎమ్మెల్యే దంపతులు గర్భిణులు, వృద్ధులు, రోగులకు పండ్లు, పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేశారు. గర్భిణులు వైద్యుల సలహాలు తీసుకొని ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనివ్వాలని సూచించారు. పీహెచ్‌సీ డాక్టర్ డి.సుప్రజ, డాక్టర్ ఎస్.శ్రీవాసవి, సీహెచ్‌వో కె.రమేష్‌రెడ్డి, సర్పంచ్ శెట్టిబత్తుల సువర్ణరాజు, రుద్రరాజు సుజాత, రమేష్‌రాజు, మండల సమైక్య అధ్యక్షురాలు కడలి నాగలక్ష్మి, గణపతినీడి రాంబాబు, రుద్రరాజు రమేష్‌రాజు, రుద్రరాజు రవి, బొంతు కాశీవిశ్వనాధం, దొమ్మేటి పురుషోత్తముడు, శీలబోయిన జయరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


పితానికి పుష్పగుచ్ఛం ఇస్తున్న కూటమి నేతలు

కొమ్ముచిక్కాలలో..

ఆచంట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ జన్మదిన వేడుకలు కొమ్ముచిక్కాలలోని ఆయన స్వగృహంలో మంగళవారం నిర్వహించారు. టీడీపీ, బీజేపీ, జనసేన నేతలతో పాటు నాలుగు మండలాల అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి పుష్పగుచ్ఛం అందజేశారు. మంత్రి నిమ్మల రామానాయుడు, వలవల బాబ్జి, మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు జిలా నాయకులు, పితాని పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

పెనుగొండ: ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ 73వ జన్మదిన వేడుకలు మండలంలో వేడుకగా నిర్వహించారు. ఎమ్మెల్యే కార్యాలయంలో వడలికి చెందిన పలువురు నాయకులు 60 కేజీల కేక్ కట్ చేయించారు. చిలుకూరి ప్రసన్న కుమార్, ఉప్పలపాటి చంటి, గణపతినీడి వెంకట రామారావు, కంకటాల ఉదయకృష్ణ, సంకురాత్రి నాగేంద్ర చౌదరి, గణపతినీడి రాంబాబు, కడలి ఏడుకొండలు, నరాలశెట్టి వెంకటేష్, నెక్కంటి అరుణ్ పాల్గొన్నారు.

తణుకులో విద్యా వైజ్ఞానిక ప్రదర్శన


విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్ట్‌లు

తణుకు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో సృజనాత్మకత, వైజ్ఞానిక దృక్పథాన్ని వెలికితీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయని నరసాపురం డీవైఈవో డి.మురళీ సత్యనారాయణ అన్నారు. బాలుర ఉన్నత పాఠశా లలో మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన మంగళవారం నిర్వహించారు. ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రాజెక్టులతో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయికి వెళ్లాలన్నారు. మండలంలోని 14 పాఠశాలల నుంచి 33 ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. 11 ప్రాజెక్టులను జిల్లా స్థాయికి ఎంపికయ్యాయి. ఎంఈవో-2 బండి ఆంజనేయులు, హెచ్‌ఎంలు పద్మావతి, ఏడుకొండలు, రామకృష్ణ, పలు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన పారిశ్రామికవేత్తలు ముందుకురావాలి

భీమవరం టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికంగా జిల్లా అభివృద్ధికి నూతన పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక మండలి, ఇన్వెస్టర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. జిల్లాలో వ్యవసాయం, ఆక్వా రంగాలలో అభివృద్ధి సంతృప్తికరంగా ఉందని, పారిశ్రామికాభివృద్ధికి మరింత కృషి చేయాలన్నారు. నూతన పరిశ్రమల స్థాపనకు అనుమతులు, బ్యాంకు రుణాల మంజూరు, మౌలిక వసతుల కల్పనలో అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఇప్పటివరకు 1,218 దరఖాస్తులు రాగా 1,170 ఆమోదించడం జరిగిందని, మరో 48 దరఖాస్తులు పరిష్కరించవలసి ఉందన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి, ఎం.మంగపతి రావు, డీపీవో ఎం.రామనాథ్ రెడ్డి, ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్ స్వాతి, జిల్లా లేబర్ ఆఫీసర్ ఆకన లక్ష్మీ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ప్లాన్ లైసెన్స్ రెన్యువల్‌కు దరఖాస్తుల స్వీకరణ

భీమవరం రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామ పంచాయతీల పరిధిలో లే అవుట్లు, భవన నిర్మాణ ప్లాన్ లైసెన్స్ రెన్యూవల్‌కు ఉత్తర్వులు జారీ చేసినట్లు డీపీవో రామ్‌నాథ్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8 నుంచి డీపీవో కార్యాలయంలో దరఖాస్తులు పొందవచ్చన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 9 నుంచి 28 వరకు స్వీకరిస్తారు. అన్ని ఆర్కిటెక్ ఇంజనీర్, సర్వేయర్-1, సర్వేయర్-2 కొత్త లైసెన్స్‌లు జారీకి, పాత లైసెన్స్‌లు రెన్యూవల్‌కు దరఖాస్తులు చేసుకోవచ్చనని ఆయన తెలిపారు.

విద్యార్థి ప్రగతి మెరుగుపరచడమే లక్ష్యం : డీఈవో

తాడేపల్లిగూడెం రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థి ప్రగతి మెరుగుపరచడమే లక్ష్యంగా ప్రతీ టీచర్ పనిచేయాలని డీఈవో నారాయణ అన్నారు. తాడేపల్లిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో జీ-ఎఫ్‌ఎల్‌ఎన్‌పై ఎంపీ, యూపీ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. విద్యార్థి సామర్థ్యం మేరకు ఎలా చదివించాలో ఎఫ్‌ఎల్‌ఎన్ మెటీరియల్ ఉపయోగించి బోధించాలన్నారు. ప్రతీరోజు ఉదయం పుస్తకాల సిలబస్, మధ్యాహ్నం ఎఫ్‌ఎల్‌ఎన్ 75 రోజుల కార్యక్రమం చేపట్టాలన్నారు. సమావేశంలో డీవైఈవో రామాంజనేయులు, ఎంఈవోలు వి హనుమ, జ్యోతి, హెచ్‌ఎం సత్యనారాయణ, తదితరులు మాట్లాడారు.

బదిలీపై సస్పెన్స్

(5వ పేజీ తరువాయి)

కమిషనర్‌ను తెచ్చుకుని పాలనను గాడిలో పెట్టడమే మంచిదన్న అభిప్రాయాన్ని పలువురు సీనియర్ నాయకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి కూడా తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో కమిషనర్ బదిలీ పెద్ద హాట్‌టాపిక్‌గా మారింది. కొద్ది రోజులు ఇక్కడ కొనసాగుతారా.. లేక వెళ్లిపోతారా... అన్నది పట్టణంలో చర్చనీయాంశమైంది.

సెలవుపై వెళ్లిపోండి..

(5వ పేజీ తరువాయి)

ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ముందుగా ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అక్కడ నుంచి మునిసిపల్ కార్యాలయానికి వచ్చారు. అధికారులతో సమీక్ష నిర్వహించారు. కొంతమంది వైసీపీ కౌన్సిలర్లు డపింగ్ యార్డు సమస్య పరిష్కారం కాకుండా చూస్తున్నారన్నారు. ఇలా ఎవరు చేస్తున్నారో వారి ఇంటి ముందే చెత్త వేయాలన్నారు. అప్పుడే పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య వారికి తెలుస్తుందన్నారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా మండవారి గరువులోనే కంపోస్టుయార్డును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పట్టణ పరిశుభ్రత, ప్రజల ఆరోగ్యమే ప్రధానమన్నారు. ఆర్వో మురళీ, డీఈ ప్రసాద్, ఏఈలు నవ్య, దుర్గాకిషోర్ పాల్గొన్నారు.

భూముల రిజిస్ట్రేషన్, సమస్యలపై జేసీ ఆరా

భీమవరంటౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, మీసేవ కేంద్రాన్ని జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, సమస్యలపై ఆరా తీశారు. రిజిస్ట్రేషన్ చేయించుకోడానికి వచ్చిన వారితో మాట్లాడుతూ డబ్బులు ఏమైనా వసూలు చేస్తున్నారా అని అడిగానే. దళారులు లేకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం నేరుగా రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని సూచించారు. అక్రమ రిజిస్ట్రేషన్లకు తావులేకుండా పనిచేయాలని సిబ్బందికి జేసీ సూచించారు. అనంతరం పక్కనే ఉన్న మీసేవ కేంద్రంలో సేవలపై నిర్వాహకుడు బాలాజీని అడిగి తెలుసుకున్నారు. ఆదాయం, నివాస, కుల ధ్రువీకరణ, జనన మరణ ధ్రువపత్రాలు, ప్రభుత్వ పథకాలకు దరఖాస్తులపై నిర్ణీత రుసుం కంటే ఎక్కువ వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్డీవో కె.ప్రవీణ్‌కుమార్ రెడ్డి, తహసీల్దార్ రావి రాంబాబు, సబ్ రిజిస్టర్ టి.ప్రసాద్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ఎరువులు కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

భీమవరం రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): భీమవరం పట్టణంలోని సత్యశ్రీనివాస్ ఎంటర్‌ప్రైజెస్ ఎరువులు, పురుగు మందుల షాపును జేసీ టి.రాహుల్ కుమార్‌రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. రిజిస్టర్ ప్రకారం స్టాకును స్వయంగా పరిశీలించారు. యూరియా బస్తాల ధర బిల్లు బుక్


రిజిస్ట్రార్ కార్యాలయం, ఎరువుల దుకాణం తనిఖీ చేస్తున్న జేసీ

ద్వారా పరిశీలించి రైతులకు స్వయంగా ఫోన్ చేసి షాపుల నుంచి ఎంత ధరకు కొంటున్నది అడిగి తెలుసుకున్నారు. రబీ సాగుకు యూరియా కొరత ఉండదని, రైతులు ఆందోళన చెందవద్దని, అవసరం మేరకు యూరియా కొనుగోలు చేసుకోవాలని, ఒకేసారి కొనుగోలు చేసి నిల్వ చేసుకోవద్దని సూచించారు. రబీ సాగు అవసరాల మేరకు రైతులకు యూరియా బస్తాలను విక్రయించాలని, ఎప్పటికప్పుడు అమ్మకాలను నమోదు చేయాలని డీలర్‌కు జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి సూచించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వరరావు, ఏడీఏ ఎస్ఎస్ శ్రీనివాస్, టెక్నికల్ ఏవో కృష్ణకాంత్, తదితరులు ఉన్నారు.


పార్టీ కండువాతో ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

జనసేన బలోపేతానికి కృషి చేయాలి

తాడేపల్లిగూడెం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రజల పక్షాన నిలబడి జనసేన బలోపేతానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సూచించారు. వైసీపీ నాయకుడు తెన్నేటి జగజ్జీవన్ సుమారు 100 మంది అనుచరులతో మంగళవారం ఎమ్మెల్యే సమక్షంలో మంగళవారం జనసేన పార్టీలో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తలకు అండగా జనసేన పార్టీ నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో వర్తనపల్లి కాశీ, ఏఎంసీ అధ్యక్షుడు చాపల మంగారమేష్, పాలూరి వెంకటేశ్వరరావు, మైలవరపు రాజేంద్రప్రసాద్, ముద్దాల లక్ష్మీప్రసన్న, కామిశెట్టి శ్రీనివాస్, పెంటా రాజేశ్వరి, కట్టుబోయిన వెంకటలక్ష్మి, కృష్ణప్రసాద్, పాల్గొన్నారు.

ఆశాలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

పాలకొల్లు, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): ఆశ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని ఆశ వర్కర్ల సంఘం జిల్లా కార్యదర్శి చింతపల్లి లక్ష్మి డిమాండ్ చేశారు. సీఐటీయూ మహాసభలు జయప్రదం కావాలని పీహెచ్‌సీ వద్ద మంగళవారం పోస్టర్ ఆవిష్కరించారు. విశాఖలో ఈనెల 31 నుంచి జనవరి 4 వరకూ జరిగే సీఐటీయూ జాతీయ మహాసభలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. డి.నిర్మలకుమారి, బి.కృపమేరీ, పి విజయ దుర్గ, బి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం పవన్ చిత్రపటానికి పాలాభిషేకం

ఆచంట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కర్ణాటకకు చెందిన పీఠాధిపతులు అభినవ కృష్ణదేవరాయ బిరుదుతో సత్కరించడంపై జనసేన నాయకులు హర్షం వ్యక్తం చేశారు. వల్లూరులో పవన్ కల్యాణ్ చిత్రపటానికి మంగళవారం పాలాభిషేకం చేసి బాణసంచా కాల్పులతో సంబరాలు జరుపుకున్నారు. సొసైటీ అధ్యక్షుడు తోట ఆదినారాయణ, చిట్టూరి శ్రీనివాస్, కడిమి ఉమా మహేశ్వరస్వామి, పంపన శ్రీను, నల్లా రాధాకృష్ణ, దివి సాయిబాబు, పెచ్చెట్టి శ్రీనివాసు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుదలకు ట్రాక్టర్ ట్రక్కులు

ఇరగవరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పారిశుధ్యం మెరుగుదలకు మండలంలోని పలు పంచాయతీలకు మంగళవారం ట్రాక్టర్ ట్రక్కులను అందజేశారు. మండలంలోని అర్జునుడుపాలెం, పేకేరు, కె.ఇల్లిందలపర్రు గ్రామాల్లో చెత్త సేకరణకు ట్రాక్టర్ ట్రక్కులు అందజేసినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో పోతిరెడ్డి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

భగవద్గీత పోటీల్లో మాంటిస్సోరి విద్యార్థుల ప్రతిభ


విజేతలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పాలకొల్లు టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక వికాస్ తరంగిణి ఆధ్వర్యంలో నిర్వహించిన భగవద్గీత పోటీల్లో ఉల్లంపర్రు మాంటిస్సోరి విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వై.రేష్మశ్రీసాయి, ఎస్.గోవర్ధిత, ఎస్.ధనశ్రీ, ఎం.హిమదీపిక బహుమతులు సాధించారు. విజేతలను ప్రిన్సిపాల్ ఎస్.వసంతలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

దువ్వలో 11 మంది జూదరుల అరెస్ట్

తణుకు రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామ శివారులో జూదం ఆడుతున్న 11మందిని అరెస్ట్ చేసినట్లు రూరల్ ఎస్ఐ కే.చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం రాత్రి దువ్వ గ్రామ శివారులోని శ్రీలక్ష్మి ఫంక్షన్ హాలులో జూదం ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో రూరల్ ఎస్ఐ చంద్రశేఖర్ తన సిబ్బందితో దాడి చేశారు. 11 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 16,380 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.


పంటుపై ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

పంటు నిర్వహణపై సీపీఎం ఆందోళన

నరసాపురం టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కనీస నిబంధనలు పాటించకుండా నరసాపురం- సఖినేటిపల్లి మధ్య పంటు నడుపుతున్నారని సీపీఎం ఆధ్వర్యంలో మాధవాయిపాలెం రేవులో పంటుపై మంగళవారం ధర్నా నిర్వహించారు. పంటు నిర్వహణపై అధికారులు దృష్టి సారించాలని, టిక్కెట్ ధరలు తగ్గించాలని, ప్రస్తుత పాటదారు కాంట్రాక్ట్ రద్దు చేయాలంటూ నినాదాలు చేశారు. సీపీఎం నాయకులు కవురు పెద్దిరాజు, ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ రెండు పంటులకు ఫిట్‌నెస్ కూడా లేదన్నారు. రెవెన్యూ, మండల పరిషత్, పోలీస్ శాఖల నిరంతరం పరివేక్షణలో పంటు నిర్వహణ ఉండాలని డిమాండ్ చేశారు. కొండ, లక్ష్మణ్, శ్రీరామచంద్రుడు, మల్లేష్, అప్పారావు, దుర్గారావు, రాజు, సురేష్, పాల్గొన్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి


పీహెచ్‌సీ రికార్డులు పరిశీలిస్తున్న గీతాబాయి

పెనుగొండ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీకి వచ్చే రోగులతో మర్యాదగా నడుచుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ జి.గీతాబాయి అన్నారు. సిద్ధాంతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. పీహెచ్‌సీ రికార్డులను పరిశీలించి ఆసుపత్రిలో ప్రసవాలు పెంచాలన్నారు. ఆశాడే సమావేశంలో పాల్గొని ఆశాలను క్షేత్రస్థాయి ఆరోగ్య కార్యక్రమాల వివరాలు తెలుసుకున్నారు. పీహెచ్‌సీ డాక్టర్ డి.సుప్రియ, ఎంపీహెచ్‌ఈవో ఏఎస్.భృంగేశ్వరరావు, పీహెచ్‌ఎన్ ఎన్.వెంకటలక్ష్మి, ఆసుపత్రి సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు

పాలకొల్లు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుని సూచనలు పాటించాలని లంకలకోడేరు పీహెచ్‌సీ డాక్టర్ ఎం.నవ్య జీవన్ అన్నారు. పీహెచ్‌సీలో మంగళవారం రోటరీ క్లబ్ అధ్య క్షుడు కె.రామకృష్ణ ఆనందరాజు గర్భిణులకు వైద్య పరీక్షల కార్యక్రమం నిర్వహిం చారు. డాక్టర్ నవ్యజీవన్ మాట్లాడుతూ రక్తశాతం, పోషకాహార లోపం లేకుండా ఆహారం తీసుకోవడం వంటి పలు సూచనలు చేశారు. 35 మంది గర్భిణులను పరీక్షించారు. డాక్టర్ జి.దినేష్, ఎంపిహెచ్‌వో గుడాల హరిబాబు, పి.సత్యనారా యణ, జి.శ్రీనివాస్, చందక రాము, రమేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

వినియోగంలోకి ఇరగవరం బస్ షెల్టర్


బస్ షెల్టర్ శుభ్రం చేసిన పంచాయతీ సిబ్బంది

ఇరగవరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఇరగవరంలో ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన బస్ షెల్టర్ నిరుపయోగంగా పడి ఉంది. ఎమ్మెల్యే నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో అర్జీతో షెల్టర్ ఉపయోగంలోకి వచ్చింది. షెల్టర్ ఖాళీగా ఉండడంతో కొందరు స్థానికులు సొంత అవసరాలకు వినియోగించుకుంటున్నారు. బస్సు కోసం ప్రయాణికులు సమీపంలోని చెట్ల కింద, సమీప దుకాణాల వద్ద నిరీక్షించాల్సి వచ్చేది. ప్రయాణికుల ఇబ్బందిని ప్రజా దర్బార్‌లో పలువురు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం పారిశుధ్య సిబ్బందితో బస్టాండ్‌ను శుభ్రం చేయించి వినియోగంలోకి తీసుకువచ్చారు. ఎన్నో ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్న బస్టాండ్ వినియోగంలోకి తీసుకురావడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.



కొమరవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు


పెనుగొండ ఎస్‌వీకేపీ కళాశాలలో అవగాహన సదస్సు

బాల్య వివాహాలతో అనర్థాలు

విద్యార్థులు, ఉపాధ్యాయుల అవగాహన ర్యాలీ

తణుకు రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల వల్ల ఎన్నో అనర్థాలున్నాయని, విద్యార్థులు అవగాహనతో మెలగాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వీవీకేఎస్.కృష్ణకుమారి, సీహెచ్ వెంకటలక్ష్మి అన్నారు. వేల్పూరు, కొమరవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిషేధ చట్టం 2006పై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల భవిష్యత్‌లో తలెత్తే ఆరోగ్య సమస్యలు వివరించారు. డీసీపీవో ఎంఎస్‌వీ.సత్యనారాయణ బాల్య వివాహ నిషేధ చట్టంలోని పలు అంశాలను వివరించారు. పాఠశాల హెచ్‌ఎంలు జీ రాధాకృష్ణ, ఐసీడీఎస్ కార్యకర్తలు, ఆయాలు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. కొమరవరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

నరసాపురం రూరల్: వేములదీవి హైస్కూల్‌లో బాల వివాహ ముక్త్ భారత్ 100 కార్యక్రమాన్ని నిర్వహించారు. బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారి బి.నెహెమ్యా మాట్లాడుతూ చిన్నతనంలో వివాహాలు చేసుకోవడం వల్ల కలిగే ఇబ్బందులు వివరించారు. ఐసీడీసీ సూపర్‌వైజర్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సామాజిక మాధ్యమాలలో జాగ్రత్తగా ఉండాలి

పెనుగొండ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికలు సామాజిక మాధ్యమాలలో జాగ్రత్తగా ఉండాలని ఎస్‌వీకేపీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యనారాయణ అన్నారు. ఐద్వా ఆధ్వర్యంలో 'మహిళలు, బాలికలపై డిజిటల్ హింసను ముగిద్దాం- ఐక్యంగా ముందుకు సాగుదాం' అంశంపై సదస్సు నిర్వహించారు. సాంకేతికత దుర్వినియోగం అవుతున్న ప్రస్తుత తరుణంలో బాలికలు మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. వ్యక్తిగత సమాచారం, చిత్రాలను ఎవరితోనూ పంచుకోకూడదన్నారు. ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ మాట్లాడుతూ బాలికలు, మహిళలపై జరిగే సామాజిక గృహ, డిజిటల్ హింసను ధైర్యంగా ఎదిరించాలన్నారు. అధ్యాపకులు కె.సోనికుమారి, జి.దుర్గాప్రసాద్, టి.రూపవల్లి, ఎస్.శ్రీనివాసరావు, కె.సుబ్బలక్ష్మి, నాగిశెట్టి లక్ష్మి దుర్గాభవాని, కానూరి తులసి ఐద్వా ప్రతినిధులు సరిపల్లి జయప్రభ, కేతా పద్మ, డి.శకుంతల పాల్గొన్నారు.

అన్న సమారాధన దైవ కార్యక్రమం


మహా కుంభానికి హారతి ఇస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): అన్న సమారాధన భగవంతుడు మెచ్చే కార్యక్రమమని ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు అన్నారు. దాసాంజనేయ స్వామి ఆలయంలో హనుమద్రవ్రత ఉత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం అన్న సమారాధన చేశారు. కుంభానికి ఎమ్మెల్యే అంజిబాబు పూజలు చేసి సమారాధన ప్రారంభించారు. తోట సీతారామలక్ష్మి, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి, కోళ్ళ నాగేశ్వరరావు పూజలు చేశారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ దారపరెడ్డి త్రివిక్రమ్, ఏపీఐఐసీ డైరెక్టర్ చలమల చంద్రశేఖర్, ఈవో నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

క్షీరారామంలో శివ సహస్ర నామ పూజలు



అభిషేక మండపంలో ప్రత్యేక పూజలు

పాలకొల్లు అర్బన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం శివ సహస్ర నామార్చన చేశారు. సప్త సోమవారాలు, సప్త మారేడు దళాలతో ఏడు వారాలు పూజలు చేసుకున్న భక్తులు 15 మంది జంటలతో అభిషేక మండపంలో భమిడిపాటి వెంకన్న శివ సహస్ర నామార్చనలు చేయించారు. చైర్మన్ మీసాల రాము, ఈవో ఎం.శ్రీనివాసరావు, సూపరిండెంటెంట్ పి.వాసు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి జామ పండ్లతో పూజ



పెనుమంట్ర, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆంజనేయ నవరాత్రుల్లో భాగంగా జుత్తిగ ఉమా వాసుకి రవి సోమేశ్వరస్వామి ఆలయంలో ఆంజనేయస్వామికి మంగళవారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. జామ పండ్లతో పూజలు చేశారు. టీడీడీ వేద పండితులు వేమూరి ఫణీంద్ర శర్మ హనుమద్వ్రతం విశిష్టతను భక్తులు వివరించారు. ఆలయ అర్చకులు ర్యాలీ వాసు శర్మ గణేష్ శర్మ, రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. ప్రముఖ సిద్ధాంతి తంగిరాల వెంకట మల్లికార్జునశర్మ, కామాక్షిదేవి ఆలయ ఈవో సాయిప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

అత్తిలిలో ముగిసిన షష్టి ఉత్సవాలు

అత్తిలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అత్తిలిలో గత నెల 25 నుంచి జరుగుతున్న షష్టి ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. 15 రోజులపాటు వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారికి వివిధ వాహనాలలో ప్రతి రోజు గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు ఐలూరి రామం, కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆలయ పునఃనిర్మాణానికి నిధులు మంజూరు

ఆకివీడు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పార్వతీ సమేత వెంకటలింగేశ్వర స్వామి దేవస్థానం పునఃనిర్మాణానికి నిధులు మంజూరయ్యాని ఏఎంసీ చైర్మన్ బొల్లా వెంకట్రావు మంగళవారం తెలిపారు. ఆలయ పునఃనిర్మాణానికి రూ.1.65కోట్లు మంజూరు చేయాలని సీజీఎఫ్‌కు ప్రతిపాదనలు పంపించామని, రూ.1.10కోట్లు మంజూరైనట్లు తెలిపారు. మ్యాచింగ్ కంట్రిబ్యూషన్ రూ.55లక్షలు బ్యాంకులో జమ చేయాల్సిఉందన్నారు. ఆలయ ఈవో అల్లూరి సత్యనారాయణరాజు, గంధం ఉమా, గొంట్లా గణపతి, గుర్రం శ్రీనివాసరావు, గుర్రం అరవింద్, అర్చకులు మెవ్వా సుబ్రహ్మణ్యం, నేరెళ్ళ రామ చెంచయ్య, కిమిడి నాగరాజు తదితరులు ఉన్నారు.

సహకార ఉద్యోగుల ధర్నా



పాలకొల్లు అర్బన్: సహకార ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డీసీసీబీ వద్ద ఆందోళన చేపట్టారు. వేతన సవరణ చేపట్టాలని, ఉద్యోగుల రిటైర్మెంట్ వయస్సు 62ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు 2019 తరువాత చేరిన ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని నినాదాలు చేశారు. పి.కృష్ణారావు, ఎం.మురళీకృష్ణ, కె.కృష్ణ కిషోర్, ఆకుల వెంకటేశ్వరరావు, బి శ్రీనివాసరావు, గుడాల ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **భీమవరం టౌన్ :** ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 12, 13 తేదీల్లో భీమవరం బాలోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఇందుకూరి ప్రసాదరాజు, సాగిరామకృష్ణ నిశాంత్ వర్మ తెలిపారు. భీమవరం, ఉండి, కాళ్ల, ఆకివీడు, వీరవాసరం మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలల్లోని విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు.
- **వీరవాసరం (భీమవరం టౌన్) :** పీహెచ్‌సీలో గర్భిణులకు కొల్లా భాస్కరమ్మ, వీర రాఘవులు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని మంగళవారం అందించారు.
- **ఆకివీడు :** ఆశాలకు కనీసవేతనం రూ.26వేలు చేయా లని సీఐటీయూ నేతలు కె.తవిటినాయుడు, పెంకి అప్పారావు డిమాండ్ చేశారు. యూపీహెచ్‌సీ దగ్గర ఆశాలతో కలిసి వారు నిరసన తెలిపారు.
- **నరసాపురం టౌన్ :** పట్టణంలో సినార్టు సంస్థ, స్టార్‌నెట్ వర్క్, ఐహెచ్‌హెచ్‌ల ఆధ్వర్యంలో 100 మంది వీవర్స్ కుటుంబాలకు నిత్యావసర కిట్‌లు కామన బుజ్జితో కలిసి అందించారు. తహసీల్దార్ ఐవీవీ.సత్యనారాయణ, డీవీవీ.సురేష్, శివశేఖర్, పాల్గొన్నారు.
- **పాలకొల్లు అర్బన్ :** పట్టణంలోని పీఆర్‌ఆర్ క్లబ్ ఆధ్వర్యంలో జీవీఎస్‌వీఆర్ మునిసిపల్ మోడల్ ప్రైమరీ పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేశారు.
- పాలకొల్లులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోనియాగాంధీ పుట్టిన రోజును నాయకులు ఘనంగా నిర్వహించారు. గోగులమండ భాస్కరరావు, కె హరికిరణ్, షేక్ మహబూబ్ జానీ పాల్గొన్నారు.
- **పాలకొల్లు టౌన్ :** వసుధా ఫౌండేషన్ సేవా కార్యక్రమాల్లో భాగంగా అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేసినట్టు కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు తెలిపారు.
- **తణుకు :** సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సంఘ కార్యాలయం నందు ఉచిత వైద్య సేవలు నిర్వహించారు. డాక్టర్ బి.రమేష్‌చంద్రబాబు బీపీ, షుగర్ పరీక్షలు 26మందికి రిపోర్టులు అందజేశారు.
- **తణుకు రూరల్ :** మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజల కోటి సంతకాల సేకరణ వివరాలను మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు వెల్లడించారు. కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు.
- **అత్తిలి :** లయన్స్ క్లబ్‌లో డాక్టర్ ఎం.రాజేందర్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 60 మంది రోగులను పరీక్షించారు. పట్నాల వెంకటేశ్వరరావు దాసం బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.
- **ఇరగవరం :** మార్టేరు ప్రక్కిలంక రోడ్డులో తూర్పు విప్పర్రు, రాపాక గ్రామాల పరిధిలో రూ.3 కోట్లతో సీసీ రహదారి నిర్మిస్తున్నట్లు ఆర్ అండ్ బి డీఈ జి.వరలక్ష్మి తెలిపారు.